0933520440
09305978486
09794359502
PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23

visit: www.visakhasamacharam.com

విశాఖ సమాచారము

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 236 విశాఖపట్నం, 04 జూలై 2023 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరిగా ఉండాలి: సీఎం

తాడేపల్లి: మహిళా, శిశు సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశం చేపట్టారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు.

మంత్రి ఉషశ్రీ చరణ్, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి. కృష్ణబాబు, మహిళాశిశుసంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, పాఠశాల విద్యాశాఖ (మౌలిక వసతుల కల్పన) కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళాశిశుసంక్షేమశాఖ డైరెక్టర్ ఎం.విజయ సునీత, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ అండ్ సీఈ జి. వీరపాండ్యన్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

వైయస్సార్ సంపూర్ణ పోషణ, వైయస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద ఇచ్చే బేక్ హోం రేషన్ సరుకులన్నీ అత్యంత నాణ్యంగా ఉండాలని సీఎం ఆదేశం జారీచేశారు. ఈ సరుకుల పంపిణీపై మంచి ఎస్ఓపీ పాటించాలని అధికారులను ఆదేశించారు. క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా, అర్హులైన వారందరికీ అందేలా ఎస్ఓపీ పాటించాలని, దీనికి సంబంధించి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంపై బలమైన పర్యవేక్షణ చేయాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు గ్రామంలో ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పౌష్టికాహార రోజులను నెలలో రెండుసార్లు పాటించేలా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలియజేశారు. ప్రతి నెల మొదటి, మూడవ శుక్రవారాల్లో ఈ కార్యక్రమాలు జరగాలని, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో దీన్ని అనుసంధానం చేయాలని అన్నారు. పిల్లల ఎదుగుదల, టీకాలు, పౌష్టికాహారం, చక్కటి ఆరోగ్యపు అలవాట్లు తదితర విషయాలపై ఈ కార్యక్రమం ద్వారా పర్యవేక్షణ చేయాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా చికిత్సకు అవసరమైన వారిని రిఫరల్ చేసే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌తో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కూడా ఉండి ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఆదేశించారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు పిల్లల ఎదుగలను పర్యవేక్షించేందుకు స్టాడీ మీటర్, ఇన్‌ఫాంట్ మీటర్, సాల్టర్ స్కేల్, బరువును తూచే యంత్రాలన్నింటినీ కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తున్నామన్నారు అధికారులు.

పీపీ-1, పీపీ-2 తరగతుల విద్యార్థులకు ఇచ్చే పాఠ్య ప్రణాళికపైన కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు సీఎం. పిల్లలకు ఇంగ్లిషు భాషపై పునాదులు అదే దశలో ఏర్పాటు కావాలని ఆదేశించారు. పదాలు పలికేతీరు, ఫొనెటిక్స్ తదితర అంశాలపై శ్రద్ధపెట్టాలని సూచించారు. పిల్లలు త్వరగా నేర్చుకునే వయసు కాబట్టి వారికి అత్యుత్తమ బోధన అందించాలని అభిలాషించారు. అంగన్‌వాడీ టీచర్ డివైజ్‌లో స్పోకెన్ ఇంగ్లిషుకు సంబంధించి పాఠ్యాంశాలను లోడ్ చేయడం ద్వారా వివిధ పదాలను ఎలా ఉచ్చరించాలన్న దానిపై తగిన శిక్షణ పిల్లలకు ఇచ్చినట్టు అవుతుందన్నారు. దీనిపై మంచి ఆలోచనలు చేసి వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. తద్వారా ఇప్పుడున్న బోధనా పద్ధతులను మరింత బలోపేతమౌతాయన్నారు. అంగన్వాడీల్లోని 3-6 ఏళ్ల వయస్సున్న పిల్లలకు 19 వస్తువులతో కిట్లు ఇస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ఈ నెలాఖరుకల్లా ఈ

(మిగతా 2లో)

ప్రారంభమైన విశాఖ శారదా పీఠాధిపతుల చాతుర్మాస్య దీక్ష

విశాఖపట్నం, (విశాఖ సమాచారము): విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి, స్వాత్మానందేంద్ర స్వాముల చాతుర్మాస్య దీక్ష ప్రారంభమైంది. గురు పూజా మహోత్సవం సందర్భంగా వ్యాస పూజ నిర్వహించి దీక్షకు శ్రీకారం చుట్టారు. రిషికేష్‌లోని విశాఖ శారదాపీఠం ఆశ్రమం ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచింది. ఉదయం గంగానదీ తీరంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి పవిత్ర స్నానం ఆచరించారు. ఆ తర్వాత గోమతను ప్రత్యేకంగా పూజించారు. దీక్ష నిర్విఘ్నంగా కొనసాగేందుకు అఘోర మంత్ర సహిత గణపతి హెూమాన్ని దక్షిణామూర్తి స్తోత్రాన్ని స్వరూపానందేంద్ర స్వామి నిర్వహించారు. వ్యాస పూజలో

(మిగతా 2లో)

పర్యావరణహితంగా నడచుకోవాలి

విశాఖపట్నం, (విశాఖ సమాచారము): పర్యావరణహితంగా ప్రజలు నడచుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఫ్రీ బ్యాగ్ డేని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. 'సే నో టు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్-బ్రింగ్ యువర్ ఓన్ బ్యాగ్-గ్రో గ్రీన్ బ్యాగ్స్' అనే నినాదంతో తయారు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతీ విద్యార్థి చక్కని సందేశాన్ని సమాజంలోనికి తీసుకువెళ్లే దిశగా అవార్డులు కృషిచేయాలన్నారు.

విద్యవిభాగాధిపతి ఆచార్య టి.పారోస్ రాజు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్లాస్టిక్‌పై నిషేధం విధించడం జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో సైతం సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ని నిషేధించారని, దీనిని ప్రజలంతా పాటించాలన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను గుర్తించాలని, భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలిన పిలుపునిచ్చారు.

(మిగతా 2లో)

యుద్ధ ప్రాతిపదికన వ్యర్థాలను తొలగించండి

విశాఖపట్నం, (విశాఖ సమాచారము): గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులు నడిచిన మార్గంలోని వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ జోనల్ కమిషనర్లను ఆదేశించారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణలో భక్తులు నడిచిన మార్గాన్ని పరిశీలించారు. గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు వచ్చారని, వారు నడిచే మార్గంలో ప్రతి చోట పేపర్ ప్లేట్స్, వాటర్ బాటిల్స్, ఆహార పదార్థాల వ్యర్థాలు ఉన్నాయని, అయా జోన్ల పరిధిలోని శానిటరీ

(మిగతా 2లో)

భక్తి శ్రద్ధలతో గిరిప్రదక్షిణ

విశాఖపట్నం, (విశాఖ సమాచారము): శ్రీ సింహాచలం లక్ష్మీ నృసింహ స్వామి వారి గిరిప్రదక్షణ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంగరంగ వైభవంగా జరిగింది. గిరిప్రదక్షిణలో విశాఖ వాసులతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన భక్తులు సుమారు అయిదు లక్షల పైబడి పాల్గొన్నారు. తొలిపావంచ నుండి అడివివరం, హనుమంతవాక, వెంకోజ పాలెం, సీతమ్మధార, మురళి నగర్, ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం మీదుగా సింహాచలం దేవస్థానం వరకు అప్పన్న స్వామి గిరి ప్రదక్షణ ఆద్యంతం పినులవిందుగా సాగింది. అధికారులు అనునిత్యం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ డా ఏ.మల్లికార్జున ఆదేశాలతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సింహాచలం దేవస్థానం వారు, జీవీఎంసీ ఎక్కడి కక్కడ త్రాగునీరు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేకంగా 30 బస్సులు ఏర్పాటు చేసి భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు , ఎన్ఎస్ఎస్, ఎన్ సి సి మొదలైన వారు భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా సహాయ సహకారాలు అందించారు. పలువురు వాలంటరీగా మంచినీరు, మజ్జిగ భక్తులకు ఇచ్చారు.

స్థాయీ సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

విశాఖపట్నం, (విశాఖ సమాచారము): మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయీ సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ జరీ చేయడమైనదని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రస్తుత స్థాయీ సంఘం కాలపరిమితి తేది 26.07.2023 తో ముగుస్తుందని, తదుపరి స్థాయీ సంఘ సభ్యులను ఎన్నుకొనుటకు తేది 03.07.2023న ఎన్నికల నోటీసు జారీ చేయడమైనదని తెలిపారు. స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక ప్రక్రియ, నియమావాళికి సంబంధించి తేది 03.07.2023 నుండి తేది 11.07.2023 వరకు ప్రతి రోజు ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 03.00 గంటల వరకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ (ఫైనాన్సు) కార్యాలయం నందు నామినేషన్లు స్వీకరించబడునని, నామినేషన్ పత్రములు కార్యాలయం పని వేళలలో కార్యదర్శి విభాగం నుండి పొందవచ్చని తెలిపారు. తేది 11.07.2023 సాయంత్రం 5.00 గంటలకు మొత్తం అందిన నామినేషన్లు జాబితాను ప్రదర్శించబడునని, తేది 12.07.2023 ఉదయం 11.00 గంటల నుండి నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుందని, అదే రోజున అర్హత గల నామినేషన్ల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. తేది 15.07.2023 మధ్యాహ్నం 03.00 గంటల

వరకు నామినేషన్లు ఉపసంహరణకు తుది గడువని, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. తేది 19.07.2023 ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు జివిఎంసి ప్రధాన కార్యాలయంనందున్న సమావేశ మందిరంలో ఎన్నికలు జరుగుతాయని, అదే రోజు 02.00 గంటల నుండి ఓట్లు లెక్కింపు జరిపి తుది ఫలితాలు వెల్లడి చేస్తామని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

విశాఖపట్నం, (విశాఖ సమాచారము): విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జి-20 లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలలో, జిల్లా స్థాయి పోటీలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. జూన్ నెల 28వ తేదీన క్విస్ మేరీ బాలికల హై స్కూల్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన మూడు స్కూళ్లకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సర్టిఫికెట్స్ అందజేశారు.

ఈ క్విజ్ పోటీలలో జిల్లా పరిషత్ హై స్కూల్ చిట్టివలసకు చెందిన జి. ప్రవీణ్ కుమార్, జే. వెంకట కీర్తన లకు మొదటి స్థానం, రూ.10,000 /- బహుమతి , జిల్లా పరిషత్ హై స్కూల్, నరవ స్కూలుకు చెందిన వి. అనిల్ గౌతమ్, జి. సౌజన్యలకు ద్వితీయ బహుమతి, రూ.7500/-, జిల్లా పరిషత్ హై స్కూల్, అగనంపూడికి చెందిన వి సాహితీ, జే. జస్వంత్‌లకు తృతీయ బహుమతిగా రూ.5000/- ప్రైజ్ మనీ మరియు సర్టిఫికెట్ అందించినట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీన విశాఖ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి అర్ బి ఐ ఆర్థిక అక్షరాస్యత క్విజ్ కాంపిటేషన్‌కు జిల్లా నుండి మొదటి స్థానం సంపాదించిన జిల్లా పరిషత్ హై స్కూల్ చిట్టివలస విద్యార్థిని ,

(మిగతా 2లో)

(మొదటి పేజీ తరువాయిలు)

ప్రారంభమైన విశాఖ శారదా పీఠాధిపతుల చాతుర్మాస్య దీక్ష

స్వయంగా పఠిస్తూ భక్తులతో చెప్పించారు. వ్యాస పూజలో భాగంగా కలశాలకు 11 సార్లు సాష్టాంగ నమస్కారములు నమర్పించారు. ఈ పూజలో శ్రీకృష్ణుడు, వ్యాసుడు, దక్షిణామూర్తి నహా 45 మంది గురువులను ఆరాధించారు. దీక్ష చేపట్టిన అనంతరం భక్తులకు తీర్థం అందజేసారు. పీఠం దుర్నాలపతో సత్కరించి ఆశీస్సులు అందించారు. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీప ముచ్చుకూట రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు తమ ఆలయాన్ని పీఠ పాలిత ఆలయంగా ప్రకటిస్తూ స్వరూపానందేంద్ర స్వామివారికి అప్పగించారు. చాతుర్మాస్య దీక్ష అంకురార్పణ కార్యక్రమంలో తెలంగాణ కంపెనీస్ లా ట్రిబ్యునల్ మేజిస్ట్రేట్ బద్రినాథ్ దంపతులు, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, ఢిల్లీ కేడర్ ఐపీఎస్ అధికారి రామ్ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. విశాఖ శారదా పీఠాధిపతుల చాతుర్మాస్య దీక్ష సెప్టెంబరు 29వ తేదీ వరకు కొనసాగుతుంది. అప్పటివరకు స్వరూపానందేంద్ర స్వామి, స్వాత్మానందేంద్ర స్వామి రిషికేష్ లోనే ఉంటారు. అక్టోబరు మొదటి వారంలో తిరిగి విశాఖకు చేరుకుంటారు.

క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరిగా ఉండాలి: సీఎం

పంపిణీ పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ సెంటర్లలో నాడు-నేడు పనులపైన సీఎం సమీక్ష.

గతంలో సీఎం ఇచ్చిన ఆదేశాలమేరకు అంగన్‌వాడీల్లో నాడు-నేడు పనులపై ముందుకెళ్తున్నామని సి.ఎం. అధికారులకు గుర్తుచేశారు. సచివాలయంలోని సిబ్బంది ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి ఎక్కడెక్కడ మరమ్మతులు చేయాలన్న దానిపై పూర్తిగా వివరాలు సేకరించారని అధికారులు తెలిపారు . తరగతి గదులు, టాయిలెట్లు, రక్షిత తాగునీరు, ఫర్నిచర్ ఇలా అన్నిరకాలుగా కనీస సదుపాయాలతో అంగన్‌వాడీలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నాడు-నేడు ఫేజ్-2లో భాగంగానే ఈ పనులను పూర్తిచేయాలన్నారు. ఆగస్టు 15 కల్లా ఈ పనులు ప్రారంభం కావాలని, ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా స్కూళ్లలో చేపడుతున్న పనులతో పాటు ఇవి పూర్తి కావాలన్నారు. బాల్య వివాహాల నిరోధంలో కళ్యాణమస్తు, షాదీతోఫా, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెనలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ పథకాలు పొందాలంటే వధూవరులు తప్పనిసరిగా టెన్త్ చదవాలన్న నిబంధన కూడా పెట్టామని సీఎం తెలిపారు. ఒక్కసారి టెన్త్ చదివాక తర్వాత ఇంటర్మీడియట్‌కు అమ్మ ఒడి, ఆపై చదువులకు విద్యాదీవెన, వసతి దీవెన అమలవుతున్నాయని అన్నారు. దీనివల్ల బాగా చదువుకునేలా ఈ పథకాలు తగిన ప్రోత్సాహాన్ని కలిగిస్తాయని ఆశించారు. కళ్యాణమస్తు, షాదీ తోఫా, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలు, విద్యారంగంలో, బాల్య వివాహాలను అడ్డుకట్టవేయటంలో ఎంత కీలకమనే విషయంపై చైతన్యం కలిగించాలని అధికారులను ఆదేశించారు. మండలానికి ఒక జూనియర్ కళాశాల అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. టెన్త్ తర్వాత చదువులు ఆపేయాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ ప్రత్యేక జూనియర్ కళాశాలలు బాగా తోడ్పడతాయని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు.

యుద్ధ ప్రాతిపదికన వ్యర్థాలను తొలగించండి

ఇన్స్పెక్టర్లను, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శుల నేతృత్వంలో యుద్ధ ప్రాతిపదికన వ్యర్థాలను పారిశుధ్య కార్మికులచే తొలగించి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్తు వెలుగులు లాంటి సదుపాయాలు కల్పించామని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరిని కమిషనర్ అభినందించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ ఎఫ్ఎం శర్మ , ఎన్ మధుసూదన్ రావు కౌన్సిలర్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్లూరి జయంతి

విజయనగరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని అధికారులు, సిబ్బంది అంతా హాజరు కావాలని ఆయన కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్లూరి జయంతిని గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నిర్వహించాలని డీఆర్ఓ సూచించారు.

వినతుల పరిష్కారం సత్వరమే జరగాలి

కాకినాడ, (విశాఖ సమాచారమ్): జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో అందిన వినతులను సత్వరం పరిష్కారించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు డా.కృతికాశుక్లా, జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ, డీఆర్‌వో కె.శ్రీధర్ రెడ్డి, ఇంచార్జ్ జెడ్పీ సీఈవో ఎ.రమణా రెడ్డి, బిసి కార్పొరేషన్ ఈడీ ఎస్.వీ.ఎస్ సుబ్బులక్ష్మి, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణితలతో కలిసి హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, పరిష్కారించ వలసినవి అయా శాఖల అధికారులను కలెక్టరు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం-384 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికాశుక్లా మాట్లాడుతూ

జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. ఒకే అంశంపై అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోపు పరిష్కరించాలని కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన శ్రీలంక ప్రతినిధులు

అమరావతి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శ్రీలంక ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి లోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం శ్రీలంక ఈస్టర్న్ ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండమాన్, శ్రీలంక డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ డి.వెంకటేశ్వరన్, ఇతర అధికారులు సీఎం జగన్‌తో సమావేశమయ్యారు. దీనిలో భాగంగా తమ దేశంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని శ్రీలంక ప్రతినిధులు కోరారు.

శ్రీలంక నుంచి భారత దేశానికి వచ్చే భక్తులు 50శాతం మంది తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వస్తారని, వారి ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి విన్నామని శ్రీలంక ప్రతినిధులు సీఎం జగన్‌కు తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి గురించి విన్న తర్వాత సీఎం వైఎస్ జగన్‌ను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించాలన్న తమ అధ్యక్షుడు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రిని కలిసినట్లు శ్రీలంక ప్రతినిధులు తెలిపారు.

వ్యవసాయ, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. ఆక్వారంగం, వాటి ఎగుమతుల్లో ఏపీ గణనీయ ప్రగతి సాధించిన నేపథ్యంలో శ్రీలంకలో కూడా ఆక్వారంగ ప్రగతికి సహకారం అందించాలని కోరారు. కోవిడ్, దిగుమతులు కారణంగా దెబ్బతిన్న శ్రీలంక ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతోందని, ఖనిజవనరులు, పర్యాటకరంగంలో పెట్టుబడులకు శ్రీలంక ప్రభుత్వం ఆహ్వానిస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.

మహారాష్ట్రలో పి'వార్'- అజిత్ తిరుగుబాటుపై శరద్ కీలక వ్యాఖ్యలు!

మహారాష్ట్ర రాజకీయాల్లో ఆదివారం కీలక పరిణామం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) పార్టీలో తిరుగుబాటు చెలరేగింది. ఇందులో భాగంగా ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ సోదరుడి కొడుకు కీలక నేత అజిత్ పవార్ బీజేపీ - ఏక్‌నాథ్ షిండే శివసేన ప్రభుత్వంలో చేరిపోయారు. అయితే ఈ విషయాలపై స్పందించిన శరద్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు.

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ మహారాష్ట్రలోని సతారాలో తన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. తన సోదరుడి కుమారుడు అజిత్ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి బీజేపీ - ఏక్నాథ్ షిండే నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరిన ఒకరోజు తర్వాత ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర పార్టీలను విచ్ఛిన్నం చేసే బీజేపీ వ్యూహాలకు కొంత మంది బలైపోయారని గుర్తుచేశారు. దీంతో పరోక్షంగా అజిత్ పవార్ వ్యవహారాన్ని ప్రస్థావించారని అంటున్నారు.

ఇదే సమయంలో బీజేపీపై పలు కీలక వ్యాఖ్యలు చేసిన ఆయన మహారాష్ట్రతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కులం మతం పేరుతో విభేదాలు సృష్టిస్తున్నారని అధికారంలో ఉన్న బీజేపీని ఉద్దేశించి పవార్ అన్నారు. నేడు మహారాష్ట్రతో పాటు దేశంలో కొన్ని వర్గాలు కులం మతం పేరుతో సమాజంలో చిచ్చు రేపుతున్నాయని అన్నారు.

ఇదే క్రమంలో తన సోదరుడి కుమారుడు అతని విధేయులు అంతర్గత తిరుగుబాటు గురించి చర్చించడానికి జూలై 6న పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు శరద్ పవార్ ప్రకటించారు. ఇదే సమయంలో అజిత్ పవార్ తదితరులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ ముందు ఎన్సీపీ పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు.

ఈ సందర్భంలో పార్టీలో ఉన్న కార్యకర్తలకు నాయకులకు గతాన్ని గుర్తు చేస్తూ ధైర్యం చెప్పే ప్రయత్నం చేసిన శరద్ పవార్ కలాంటి పరిస్థితులు పార్టీకి కొత్త కాదని అన్నారు. 1980లో పార్టీ పెట్టిన సమయంలో 58 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే చివరకు 6 మంది మిగిలారని అయినా కూడా తాను పార్టీని బలపరిచానని అన్నారు. ఆ సమయంలో తర్వాత జరిగిన ఎన్నికల్లో పార్టీ మారిన వారంత తర్వాత ఓడిపోయారని శరద్ పవర్ గుర్తు చేశారు.

కాగా ఓ వైపు బీజేపీని ఎదుర్కోవడానికి విపక్షాల ఐక్యత కోసం శరద్ పవార్ తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఎన్సీపీలో చీలిక తీసుకు వస్తూ అజిత్ పవార్ ఎనిమిదిమంది ఎమ్మెల్యేలను వెంట బెట్టుకుని మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరిపోయిన సంగతి తెలిసిందే. ఫలితంగా ఆయనకు డిప్యూటీ సీఎం పదవి దక్కింది.

త్వరలో పెళ్లికాని వారికి పింఛను!

రాజకీయ నాయకులు ఇచ్చే హామీలు చేసే వాగ్దానాలు ఒక్కోసారి ఆశ్చర్యంగానూ, మరోసారి హాస్యంగానూ అనిపిస్తుంటాయని అంటుంటారు. మరి కొంత మంది సాధ్యాసాధ్యాలు చూసుకోకా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు. ఇక ఉచితాల విషయంలో ఈ వ్యాఖ్యలు ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఆ సంగతి అలా ఉంచే. ఇప్పటి వరకూ ఉన్న ఉచిత హామీలు భరోసా హామీలు పెన్షన్ హామీలను తలదన్నేలా ఒక కొత్త హామీ తెరపైకి వచ్చింది.

అవును చితంకులువుకు, వికలాంగులకు, వృద్ధులకు పెన్షన్ ఇస్తుండటం సహజంగా జరుగుతున్న సంగతిగా తెలిసిందే. ఈ సమయంలో హర్యానా ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా పెళ్లికాని వారికి పింఛను ఇచ్చేలా కొత్త పథకం ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది.

ఈ విషయాన్ని స్వయంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. కాకపోతే ఒక్క కండిషన్ పెట్టారు.

తాజాగా కర్నాల్‌లో జరిగిన జన్ సంవాద్ కార్యక్రమంలో పాల్గొన్న హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నెల రోజుల్లోగా పెళ్లికానివారికి పింఛన్ స్కీంను అమలులోకి తెస్తామని ప్రకటించారు. ఆ సభ సందర్భంగా ఓ 60 ఏళ్ల పెళ్లి కాని వ్యక్తి మాట్లాడుతూ పింఛను దరఖాస్తు విషయంలో తాను సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు.

దీనికి బదులిచ్చిన సీఎం మనోహర్ లాల్ వివాహం కాని మహిళలు పురుషులకు నెలవారీ పింఛను ఇచ్చేలా కొత్త పథకం తీసుకొచ్చేందుకు సన్నాహాలు మొదలుపెట్టామన్నారు. నెలరోజుల్లో ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇలా పెళ్లికానివారు అంటే పెళ్లీడు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ ఛాన్స్ లేదు. 45 ఏళ్లనుంచి 60 ఏళ్ల మధ్య వయసుండి అప్పటికీ పెళ్లికానివారే ఈ పథకానికి అర్హులు.

అయితే ఈ పథకం ప్రకారం ఎంత పింఛను ఇస్తారు అనే విషయం మాత్రం సీఎం ఇంకా స్పష్టం చేయలేదు. ఏది ఏమైనా ఈ కొత్త పథకం మాత్రం నెట్టింట వైరల్ అవుతోంది

పంచాంగం

మంగళవారం 04-07-2023
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం గ్రీష్మరుతువు
ఆషాఢ మాసం

తిథి : బ. పాడ్యమి రా. 03.11
నక్షత్రం : పూర్వాషాఢ ఉ. 10.21
వర్జ్యం : రా. 05.51 ల 07.21

పాకిస్థాన్ లో రహస్యంగా గడిపిన చైనా బిజినెస్ మేన్

చైనా అపర కుబేరుడు అలీబాబా సంస్థ వ్యవస్థాపకుడు జాక్ మా పాకిస్తాన్‌లో ప్రత్యక్షమయ్యారు. ఈ విషయాన్ని పాకిస్తాన్ మీడియా సంస్థ "ది ఎక్స్ ప్రెస్ ట్రిబ్యూన్" తెలిపింది. పాక్‌లో జాక్ మా అడుగు పెట్టినట్లు బోర్డ్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ మాజీ ఛైర్మన్ ముహమ్మద్ అజ్హర్ అస్సాన్ చెప్పినట్లు పాక్ మీడియా సంస్థ వెల్లడించింది. దీంతో ఈ టాపిక్ ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

అవును చైనా ప్రభుత్వంతో విభేదించి ప్రాస్తుతం అజ్ఞాతంలో ఉన్న ఆ దేశ అపర కుబేరుడు పాకిస్థాన్‌లో ప్రత్యక్షమయ్యారు. అయితే దానికి కారణం పూర్తిగా తెలియనప్పటికీ వ్యాపారా సామ్రాజ్యం చైనా నుంచి పాక్‌కు తరలించడానికే అనే చర్చ ఆన్‌లైన్ వేదికగా మొదలైంది. అయితే ఈ చర్చ తెరపైకి రావడానికి కూడా బలమైన కారణం ఉంది.

ఈ-కామర్స్ టెక్నాలజీ వంటి రంగాల్లో ప్రముఖ వాణిజ్య వేత్తగా ఉన్న జాక్ మా అలీబాబా గ్రూప్‌ను స్థాపించి అపరకుబేరుడిగా ఎదిగారు. ఈ క్రమంలో 2020లో జరిగిన ఓ పబ్లిక్ మీటింగ్ లో "చైనా రెగ్యులేటరీ సిస్టం"పై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

దీంతో చైనా అధికారులు జాక్ మాను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఆయన కంపెనీలపై దర్యాప్తు సంస్థలు వరుసగా దాడులు చేసి ఆర్థిక పరంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి.

దీంతో అలీబాబా అండ్ గ్రూప్ తీవ్రంగా నష్టపోయాయి. ఫలితంగా ఈ పరిస్థితులన్నింటినీ గమనించి కొంతకాలం భరించిన జాక్ మా 2021 చివర్లో చైనాను వీడి, అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పటినుంచి ఏదాది పాటు బయట ప్రపంచానికి కనిపించకుండా తిరిగారు. ఆ సమయంలో ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్ దేశాల్లో కనిపించినట్లు ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టేవి.

ఆ పరిస్థితుల్లో కనిపించకుండా తిరిగిన జాక్ మా ఇప్పుడు సడన్‌గా పాక్‌లో ప్రత్యక్షమవ్వడంతో కొత్త చర్చ తెరపైకి వచ్చింది. జూన్ 29న లాహోర్ లో ఆడుగు పెట్టిన జాక్ మా, 24 గంటల పాటు అక్కడే ఓ ప్రైవేట్ ప్రాంతంలో గడిపి అనంతరం అదే విమానంలో ఉజ్బెకిస్తాన్‌కు వెళ్లారట.

అయితే జాక్ మా, అతని బృందం పాకిస్తాన్‌లో వ్యాపార అవకాశాలను అన్వేషించేందుకు పర్యటించినట్లు కథనాలొస్తున్నాయి. ఇందులో భాగంగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని పాక్‌లో నెలకొల్పేందుకు అనువైన ప్రాంతాల గురించి ఆరాతీయడంతో పాటు ఆ దేశంలో వ్యాపార వేత్తలతో భేటీ అయ్యి వివిధ వాణిజ్య ఛాంబర్‌ల అధికారులతో మంతనాలు జరిపినట్లు తెలుస్తుంది.

అయితే ఈ విషయాల పై స్పందించిన బీఓఐ మాజీ ఛైర్మన్ ముహమ్మద్ అజ్హర్ అస్సాన్ జాక్ మా పర్యటన తన వ్యక్తిగత ప్రయోజనాల కోసమేనని ట్వీట్ చేశారు. ఇదే సమయంలో ఆయన పర్యటన వివరాలు చైనా రాయబార కార్యాలయ అధికారులకు కూడా తెలియదని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

జీహార్‌లో విరిగిన చక్రంతో 10 కిలోమీటర్లు ప్రయాణించిన ఎక్స్‌ప్రెస్ రైలు

విరిగిన చక్రంతోనే ఓ ఎక్స్‌ప్రెస్ రైలు 10 కిలోమీటర్లు ప్రయాణించిన సంఘటన బీహార్‌లో జరిగింది. ఈ భయానక ఘటన ముజఫర్‌పూర్-హాజీపూర్ రైల్ సెక్షన్ భగవాన్‌పూర్ స్టేషన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం పవన్ ఎక్స్‌ప్రెస్ రైలు బీహార్‌లోని ముజఫర్‌పూర్ రైల్వే స్టేషన్ నుండి ముంబైకి బయలుదేరింది. కాసేపటికి ఎస్-11 కోచ్‌లో పెద్ద శబ్దాలు వినిపించాయి. రైలులోని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు భగవాన్‌పూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత ప్రయాణికులు అప్రమత్తం కావడంతో సమస్యను గుర్తించే ప్రయత్నం చేశారు.

పవన్ ఎక్స్‌ప్రెస్ రైలు భగవాన్‌పూర్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరగా ప్రయాణికులు చైన్ లాగి రైలును ఆపేశారు. ఆ తర్వాత కొంతమంది ప్రయాణికులు రైలు డ్రైవర్, గార్డులకు సమాచారం అందించారు. రైల్వే అధికారులు తనిఖీ చేయగా ఎస్-11 కోచ్ చక్రం విరిగిపోయినట్లుగా గుర్తించారు. రైల్వే ఇంజినీర్లు, ఉద్యోగులు రైల్వేస్టేషన్‌కు చేరుకొని చక్రానికి మరమ్మతులు చేపట్టారు. 'పవన్ ఎక్స్‌ప్రెస్‌లో చక్రం విరిగిందని మాకు సమాచారం అందింది. మా బృందం అక్కడికి చేరుకుని లోపాన్ని సరిదిద్దింది' అని తూర్పు మధ్య రైల్వే హాజీపూర్ సీపీఆర్వో వీరేంద్ర కుమార్ తెలిపారు.

విశాఖ సమాచారమ్
మంగళవారం 04-07-2023

గురు పరంపర

గురు పరంపర అనేది కేవలం మనుషులకు మాత్రమే సంబంధించినది కాదు. దేవతలు, బ్రహ్మర్షులు, రాజర్షులు, మహర్షులు, యతులు ఇలా అనేక మంది తమ గురువుల ద్వారా ఉపదేశాలు పొంది జ్ఞానాన్ని అర్జించారు.

ప్రతి తరానికి మానసిక వేదనను నయం చేసే శక్తిని ప్రసాదించే సాంప్రదాయం గురు-శిష్య పరంపర. ప్రతి గురువు ప్రపంచానికి అనేక సేవలు చేసారు వారిద్వారా అనేక గ్రంథాలను వెలువడ్డాయి.

సాక్షాత్తు నారాయణ స్వరూపమైన వ్యాసుల వారికి గురువులు ఉన్నారు అంటే గురుస్థానం గొప్పతనం ఏమిటో చెప్పనవసరం లేదు.

సనక,సనందన,సనాతన, సనత్కుమారులకు జ్ఞానోపదేశం చేసిన గురువు దక్షిణామూర్తి. ఈయన మహా శివుడు లోకాలకు ఆది గురువు.

కృతవీర్యుడు,కార్త్యవీర్యార్జునుడు,మదాలస, పరశు రాముడు, మొదలగు దైవాంశ సంభూతులకు తత్వజ్ఞానం బోధించి మోక్షం ప్రసాదించిన వాడు దత్తాత్రేయుడు. త్రేతాయుగంలో సతలగుణ సంపన్నుడు అయిన శ్రీరాముల వారు సాక్షాత్తు హరి స్వరూపమైనా విశిష్ట విశ్వామిత్రుల వంటి గురువుల ద్వారా ధర్మబోధ జరిగింది.

ద్వాపర యుగంలో నారాయణుడు కృష్ణుడిగా అవతారం గావించినపుడు సాందీప మహర్షి వద్ద విద్యను అభ్యసించాడు. మనుషులు దారి తప్పి అధర్మం రాజ్యమేలు సమయమున సాక్షాత్తు శంకరుడి అంశతో శంకరభగవత్పాదులు గురువులుగా జన్మించి లోకోద్ధరణ చేసి దేశం నలుమూలలా ప్రయాణించి నాలుగు పీఠాలు స్థాపించారు. అనేక రచనలు చేసారు. అటువంటి శంకరులకు కూడా గోవిందపాదులు గురువు.

వ్యాసులు: సత్య యుగం నుండి ద్వాపరయుగం వరకు వేదాలను దేవదానవులు కూడా అభ్యసించారు. దేవతల గురువు బృహస్పతి, దానవుల గురువు శుక్రాచార్యుడు.

కానీ కలియుగంలో మనువుచే సృష్టించిన మనుషులు కలి ప్రభావం చేత రాక్షసుల కన్నా ప్రమాదమైన వారుగా భావించి వేదాలను రక్షించే క్రమంలో వ్యాస భగవానులు ఈ దినం సమిష్టిగా ఉన్న వేదాలను విభజించి సరళీకృతం చేసారు. వ్యాసుల వారు సాక్షాత్తు విష్ణు స్వరూపులు.

"వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే!"

గురి కలిగిన వాడు గురువు అన్నారు. అటువంటి గురువులు ఏడు రకాలుగా శాస్త్రాలు సూచించాయి.

1.సూచక గురువు - చదువు చెప్పేవాడు.
2. వాచక గురువు - కుల, ఆశ్రమ ధర్మాలను బోధించేవాడు.
3. బోధక గురువు - మహామంత్రాలను ఉపదేశించేవాడు
4. నిషిద్ధ గురువు - వశీకరణ, మారణ ప్రయోగాలు నేర్పేవాడు
5. విహిత గురువు - విషయ భోగముల మీద విరక్తి కలిగించేవాడు
6. కారణ గురువు - జీవబ్రహ్మైక్యాన్ని బోధించేవాడు
7. పరమ గురువు - జీవాత్మ, పరమాత్మ ఒకటే ప్రత్యక్షానుభవాణ్ని కలిగించేవాడు.

కలియుగంలో గురువులు:

సృష్టిలో మొదటి గురువు తల్లి. గోరు ముద్దలు తినిపిస్తూ నీతి కథలు చెబుతూ బాల్యంలో పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుంది.

పురాణాల్లో యోగిని అయిన మదాలస తన మొదటి ముగ్గురు పుత్రులైన విక్రాంతుడు, సుభాహుడు, రిపుమర్దనుడికి 3వ ఏటనే తత్వబోధ చేస్తే తపోవనాలకు వెళ్ళిపోయారు. నాల్గవ కుమారుడైన అలర్కుడికి అనేక ధర్మాలను బోధించడం ద్వారా గొప్ప రాజుగా కీర్తి పొందాడు. అందుకే తల్లి బాల్యంలో మొదటి గురువు.

తండ్రి: మంత్రోపదేశం ద్వారా పునర్జన్మ ప్రసాదించి వేదాధ్యయనం చేయడానికి మార్గం చూపే తండ్రి ద్విజత్వం పొందిన వాడికి మొదటి గురువు.

పురాణాల్లోని ఋతుధ్వజుడు తన కుమారుడు కువలయాశ్వనుడికి చెప్పిన ధర్మాలు. దశరథుడు కూడా శ్రీరాముడిని అడవులను పంపడానికి కాస్త పుత్రవ్యామోహంతో దుఃఖించాడేమో కానీ ఋతుధ్వజుడు క్షత్రియుడికి యజ్ఞయాగాలు సంరక్షించడం, ప్రజాసేయస్సు మాత్రమే ధర్మం,అని బోధించి అడవులకు పంపిన గొప్ప తండ్రి,గురువు.

గురువు: విద్యను అభ్యసించి జ్ఞానం పొందడానికి తమకు సహాయపడే వారు ఇతర గురువులు.

అటువంటి మహోన్నతులైన గురువులను స్మరించుకుంటూ జరుపుకొనే ఈ వ్యాస పౌర్ణమి రోజును గురుపౌర్ణమిగా జరుపుకుంటారు. వీరు సాక్షాత్తు భగవద్ స్వరూపులు.

లబ్ధిదారులకు అందిన టిడ్కో ఇళ్ళు

కాకినాడ, (విశాఖ సమాచారమ్): అవినీతి రహితంగా, అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో గౌరవ ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని ఇందుకు ఏపీ టిడ్కో గృహాలు నిదర్శనమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి అదిమూలపు సురేష్ అన్నారు. సోమవారం ఏపీ టిడ్కో, పిఠాపురం మున్సిపాలిటీల ఆధ్వర్యంలో పిఠాపురం, గోర్స రైల్వేగేటు సమీపంలో పీఏంఏవై (అర్బన్)-వైఎస్సార్ జగనన్న నగర్‌లో ఏపీ టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించే కార్యక్రమం పిఠాపురం శాసనసభ్యులు పెండెం దొరబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి అదిమూలపు సురేష్.. కాకినాడ ఎంపీ వంగా గీత, ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మన ప్రసన్న కుమార్, ఏపీ టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ చిత్తూరి శ్రీధర్, కాకినాడ జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా తదితరులతో కలిసి తొలుత మురుగునీటి శుద్ధి యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల టిడ్కో ఇళ్లను ప్రారంభించారు. ఇళ్లలోని సౌకర్యాలను పరిశీలించారు. తమ సొంతింటి కలను సాకారం చేసిన గౌరవ రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిలువెత్తు చిత్రపటానికి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి అదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఇన్కుడ గోర్స రైల్వేగేటు సమీప పీఏంఏవై (అర్బన్)-వైఎస్సార్ జగనన్న నగర్‌లో మొత్తం 864 ఫ్లాట్లను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్, తాగునీరు, డ్రెయిన్లు, మురుగునీటి శుద్ధి యూనిట్, సిమెంటు రోడ్లు ఇలా అన్ని సౌకర్యాలూ కల్పించినట్లు వివరించారు. సమాజంలో సొంతిల్లు అనేది గౌరవాన్ని ఇస్తుందని.. అలాంటి సొంతింటి కలను సాకారం చేస్తున్న గౌరవ ముఖ్యమంత్రికి లబ్ధిదారుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు మొదటి వారం నాటికి రాష్ట్రంలో టిడ్కో లబ్ధిదారులకు అందించే ఫ్లాట్ల సంఖ్య లక్షకు చేరుతుందన్నారు. ఈ టిడ్కో గృహాల ప్రాంగణం రాబోయే రోజుల్లో టౌన్‌షిప్‌లుగా మారుతాయని.. కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు వంటివి ఇక్కడ ఏర్పాటవుతాయని వివరించారు. అన్ని విధాలా నివాసయోగ్యంగా బంధు మిత్రులతో హాయిగా జీవించడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుకు వెనకాడకుండా ఈ ఫ్లాట్లను నిర్మించినట్లు తెలిపారు. ఇంత మంచి వాతావరణంలో ఫ్లాట్లను తీర్చిదిద్ది లబ్ధిదారులకు అందించేందుకు శాసనసభ్యులు పెండెం దొరబాబు విశేష కృషిచేసినట్లు మంత్రి అదిమూలపు సురేష్ పేర్కొన్నారు.

కాకినాడ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఎన్నో అవరోధాలను అధిగమించి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫ్లాట్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. బలహీన వర్గాల గృహ నిర్మాణ రంగంలో గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నూతన చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. తిండి కోసమే ఇబ్బంది పడే పేదలకు సొంత ఇల్లు అనేది కలని.. ఆ కలను సాకారం చేస్తున్నది గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. సమాజంలో పేదలు ఆత్మ గౌరవంతో బతకాలని వారికి ఇంటి స్థలాలు, ఇళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. పేదలను తమ బిడ్డల్లా చూసుకుంటున్నారని.. వారి సంక్షేమం కోసం వివిధ పథకాలను అమలు చేస్తున్నారని వెల్లడించారు. అర్హత ఒక్కటే ప్రాతిపదికగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఎప్పుడూ లేని విధంగా పేదల కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. సుఖ సంతోషాలతో లబ్ధిదారులు ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంతో కృషి చేసి ఫ్లాట్లను సిద్ధం చేసినట్లు ఎంపీ వంగా గీత వెల్లడించారు.

ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మన ప్రసన్న కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 42వ ప్రాంతంలో ఈ రోజు టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. పిఠాపురంలో అందజేసిన ఫ్లాట్లతో కలిపితే రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు లబ్ధిదారులకు అందజేసిన టిడ్కో ఫ్లాట్ల సంఖ్య 70 వేల మైలురాయిని దాటిందని పేర్కొన్నారు. 1.5 కి.మీ. మేర పైపులైను వేసి మరీ మంచినీటి సరఫరాకు ఏలుకల్పిం చేందుకు శాసనసభ్యులు పెండెం దొరబాబు కృషిచేశారన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఏర్పాటుఅయిన వెల్లడించారు.

ఏపీ టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ చిత్తూరి శ్రీధర్ మాట్లాడుతూ 2019 నాటికి టిడ్కో ఫ్లాట్లలో 50 శాతం వరకు మాత్రమే పనులు పూర్తయ్యాయని.. ఇప్పుడు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి, నివాసయోగ్యంగా ఉండేలా తీర్చిదిద్ది లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లను సైతం ఉచితంగా చేసి లబ్ధిదారులకు ఫ్లాట్లను అందిస్తున్నట్లు వెల్లడించారు. గౌరవ ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలు అందించారని ఇది ఓ ప్రపంచ రికార్డు అని పేర్కొన్నారు.

కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి మహిళా పక్షపాతిగా వివిధ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాకినాడ జిల్లాలో టిడ్కో ద్వారా 7,288 ఫ్లాట్లు మంజూరు అయ్యాయని పీటిలో 50% ఫ్లాట్లను లబ్ధిదారులకు ఇప్పటికే అందజేసినట్లు తెలిపారు. వచ్చే రెండు మూడు నెలల్లో కాకినాడ సిటీకి సంబంధించిన ఫ్లాట్లను లబ్ధిదారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. పిఠాపురం పేజ్-1 ఏపీ టిడ్కో ప్రాజెక్టు విలువ రూ. 75.38 కోట్లని వివరించారు. నాణ్యతలో రాజీపడకుండా టిడ్కో ఫ్లాట్లను నిర్మించినట్లు, కుటుంబం హాయిగా జీవించడానికి అవసరమైన అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. తాగునీరు, విద్యుత్, డ్రెయినేజి తదితర వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఒకవైపు నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తవుతుండగా.. మరోవైపు టిడ్కో ఇళ్లలో గృహప్రవేశాలు జరుగుతుండటంతో చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా తమ కుటుంబాలను తీర్చిదిద్దుకోవా లన్నారు. కాకినాడ జిల్లాలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద 1,50,000 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు అందించడం జరిగిందని.. ఇప్పటికే 20 వేల ఇళ్లు పూర్తయి లబ్ధిదారులు నివాసం ఉంటున్నారని వివరించారు. ఈ రోజు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ డా. కృతికా శుక్లా పేర్కొన్నారు.

పిఠాపురం శాసనసభ్యులు పెండెం దొరబాబు మాట్లాడుతూ కొంచెం ఆలస్యమైనప్పటికీ నివాసయోగ్యంగా ఫ్లాట్లను తీర్చిదిద్ది లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో కృషిచేశాను.. ఈరోజు అన్ని సౌకర్యాలూ ఉన్న ఫ్లాట్లను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలు అందించారని ఒక్క పిఠాపురంలోనే 22 వేల పట్టాలు అందించినట్లు వివరించారు. తొలిదశలో 13,500 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రికి పిఠాపురం నియోజకవర్గం ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ బడుల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పిన వాటిలో 99 శాతం మేరకు ముఖ్యమంత్రి అమలుచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి అదిమూలపు సురేష్ ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి లబ్ధిదారులకు తాళాలను రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో డైరెక్టర్లు కానూరి నాగేశ్వరి, ప్రతివాడ రాఘవరావు, ఖండాపు గోవిందరావు, ఏపీ టిడ్కో ఈఈ పాట్ల రీటా, మెప్మా పీడీ బి.ప్రియంవద, స్థానిక ప్రజాప్రతినిధులు, టిడ్కో అధికారులు, ఇంజనీర్లు తదితరులు హాజరయ్యారు.

ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన జెఎన్‌టియుకె

కాకినాడ, (విశాఖ సమాచారమ్): జెఎన్‌టియుకె కాకినాడ ఆధ్వర్యంలో జూన్ 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా మరియు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లలో 100 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన ఏపి ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ - 2023 ప్రవేశ పరీక్షా పేపరును జెఎన్‌టియుకె ఏసి కాన్ఫరెన్స్ హాలు నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపిఎస్‌సిహెచ్ఈ) ఛైర్మన్ ప్రొ.కె.హేమచంద్రారెడ్డి విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ.కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మరియు హైదరాబాద్‌లలో నిర్వహించిన ఏపి ఈసెట్-2023 ప్రవేశ పరీక్షకు 38,181 మంది దరఖాస్తు చేసుకోగా 34,503 మంది హాజరయ్యారన్నారు. వీరిలో 31,933 మంది అర్హత సాధించారని, మొత్తంగా 92.55% మంది విద్యార్థులు ఈసెట్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని, వీరి ర్యాంకు కార్డులను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. ఈసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించిన 10 రోజులలోనే ఫలితాలను విడుదల చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ జెఎన్‌టియుకె అధికారులను అభినందించారు. ఏపి ఈసెట్-2023 ప్రవేశ పరీక్షను 11 విభాగాలలో నిర్వహించగా విద్యార్థుల నుండి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని మూడు ప్రశ్నలకు మార్కులు కలపడం జరిగిందన్నారు. త్వరలో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.

ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహ కారంతో ఏపి ఈసెట్-2023 ప్రవేశ పరీ క్షను విజయవంతంగా నిర్వహించామన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రటరీ ప్రొ.వై.నజీర్ అహ్మద్, స్పెషల్ ఆఫీసర్ డా.ఎం.సుధీర్ రెడ్డి, జెఎన్‌టియుకె రెక్టార్ ప్రొ.కె.వి.రమణ, ఏపి ఈసెట్-2023 కన్వీనర్ ప్రొ.ఎ.కృష్ణమోహన్, కో-కన్వీనర్‌లు ప్రొ.కె.వెంకటరెడ్డి, ప్రొ.కె.పద్మప్రియ, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డా. ఎం.వి.వి.ఎస్ మూర్తి జయంతి

వేడుకగా జరుపుకున్నతెలుగు తమ్ముళ్ళు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన మాజీ పార్లమెంట్ సభ్యులు, గీతమ్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు స్వర్గీయ డా. ఎం. వి. వి. ఎస్. మూర్తి 85వ పుట్టిన రోజు వేడుకగా జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి, కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ పార్లమెంటు అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ గండి బాబ్జి, జివిఎంసి టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి గొంప కృష్ణ, రాజమండ్రి నారాయణ, విల్లు చక్రవర్తి, ఆతకపాక సుజాత, చింతలపూడి సత్యనారాయణ, పలిశెట్టి తాతాజీ, పొడుగు కుమార్, పి.జయరాజు జాన్, నడిగట్ల శంకర్రావు, నమ్మి రవికుమార్, ముక్త రాజారావు, నడిగట్ల శంకర్రావు, గాదు అప్పల నాయుడు, జి వెంకటరావు, కృష్ణ, ముక్క రామకృష్ణ, ఉరుకుటి పైడిరాజు, పెద్దాడ పైడిరాజు, ఫారుక్, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఒక్కటే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలు

కాకినాడ, (విశాఖ సమాచారమ్): కులం, మతం, వర్గం, పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హత ఒక్కటే ప్రాతిపదికగా గౌరవ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా పథకాలు, సేవలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాల కృష్ణ అన్నారు. కాజాలూరు మండలం, ఆర్యవటం గ్రామంలో ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. గత పది రోజులుగా గ్రామ సచివాలయం పరిధిలో ఇంటింటా సర్వే చేసి తీసుకున్న దరఖాస్తులను జగనన్న సురక్ష శిబిరంలో పరిష్కరిస్తున్న విధానాన్ని మంత్రి వేణుగోపాలకృష్ణ పరిశీలించారు. మొత్తం 1,011 సేవలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం జగనన్న సురక్ష శిబిరాల్లో జరిగాయి. మంత్రి వేణుగోపాలకృష్ణ స్వయంగా కొందరికి కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలను అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఓబీసీ సర్టిఫికేట్, ఆధార్‌కు ఫోన్ నెంబరు అనుసంధానం, సీసీఆర్‌సీ కార్డులు, కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్‌కార్డు విభజన, కుటుంబ వివరాల్లో మార్పులు వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా వివిధ పథకాలకు సంబంధించి ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే గుర్తించి వారికి కూడా ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. కులం, మతం, వర్గం, పార్టీలతో సంబంధం లేకుండా నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు మంత్రి వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. వైఎస్సార్ కాపునేస్తం, జగనన్న అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా గ్రామానికి జరిగిన లబ్ధి వివరాలను వేణుగోపాలకృష్ణ వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పీటీసీ సుబ్బారావు, ఎంపీపీ ఎం.భారతి మురళి, ఎంపీటీసీ ఈశ్వరి, తహసీల్దార్ సాయి సత్యనారాయణ, ఎంపీడీవో రతన్ రాజు, అర్యవటం గ్రామ సర్పంచ్ సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంట్లోనే సహజమైన లిప్ బామ్ చేసుకోండి

స్వయంగా లిప్ బామ్ తయారు చేసుకోండి: చలికాలంలో పెదాల సంరక్షణ కోసం లిప్ బామ్ ఉపయోగించండి. మార్కెట్ లో కొనుగోలు చేసేవి కాకుండా సహజ ఉత్పత్తులు వాడితే ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఇంట్లోనే లిప్ బామ్ ఎలా తయారు చేసుకోవాలో ఇక్కడ ఐడియాలు ఉన్నాయి, చూడండి.

చలికాలంలో పెదవులు పగలడం అనేది చాలా సాధారణమైన విషయం. వాతావరణం కాకుండా, పెదవులు పొడిబారడానికి మరో కారణం తక్కువ నీరు త్రాగడం. పెదవులు సహజమైన తేమను కోల్పోయినప్పుడు ఇలా జరుగుతుంది. కాబట్టి పెదాలు సహజమైన రంగుతో అందంగా ఉండాలంటే తగినంత నీరు తాగుతుండాలి. కొన్నిసార్లు నీరు సమృద్ధిగా తాగినప్పటికీ కూడా పెదాలలో పగుళ్లు ఏర్పడతాయి. ఎందుకంటే ఇక్కడ మృదువైన చర్మం ఉంటుంది, ఇలాంటి పరిస్థితుల్లో బయట నుంచి కూడా తగిన సంరక్షణ చర్యలు తీసుకోవాలి.

ఈ చలికాలంలో పెదాల పగుళ్లకు లిప్ బామ్ చక్కని పరిష్కారంగా ఉంటుంది. పెదవులపై లిప్ బామ్ అప్లై చేయడం వల్ల ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. అయితే మార్కెట్‌లో లభించే లిప్ బామ్‌లలో అనేక రకాల రసాయనాలు ఉంటాయి, వాటి కారణంగా మీ పెదవులు సహజ రంగును కోల్పోవచ్చు, ఆ రసాయనాలు నోటిలోకి వెళ్లినవుడు ఏమంత హానికరం కాకపోయినా, శ్రేయస్కరం అయితే కాదు.

లిప్ బామ్ ఎలా తయారు చేయాలి : మీరు ఇంట్లోనే సహజమైన లిప్ బామ్‌ను కూడా తయారు చేసుకోవచ్చు. ఎలా చేయగలమో ఇక్కడ సులభమైన మార్గాలను తెలియజేస్తున్నాము.

బీట్‌రూట్ లిప్ బామ్ : నేచురల్ లిప్ బామ్ చేయడానికి, ముందుగా మీరు బీట్‌రూట్‌ను తొక్క తీసి, ఆ తర్వాత ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఈ ముక్కలను గ్రైండ్ చేసి, దాని రసాన్ని ఒక స్ట్రైనర్ లేదా గుడ్డ సహాయంతో వడకట్టండి. ఇప్పుడు బీట్‌రూట్ రసాన్ని బాగా మరిగించాలి. ఆపై తర్వాత చల్లారనివ్వాలి. చల్లారిన తర్వాత అందులో అలోవెరా జెల్, కొబ్బరి నూనె కలపాలి. అంతే, బీట్‌రూట్‌తో లిప్ బామ్ సిద్ధం.

మీరు బీట్‌రూట్ లిప్ బామ్ రాసుకుంటే పెదాలకు మంచి రంగు వస్తుంది, పగుళ్లను నివారించవచ్చు. ఈ లిప్ బామ్‌ను ఫ్రిజ్‌లో ఉంచడం ద్వారా ఒక నెల పాటు ఉపయోగించవచ్చు.

రంగులేని లిప్ బామ్ ఎలా తయారు చేయాలి : వేడిని తట్టుకోగలిగే ఒక కంటైనర్ కప్పు తీసుకుని అందులో 1 టీస్పూన్ బీస్వాక్స్ వేయండి. ఇప్పుడు అర టీస్పూన్ నుబెల్లా వేయాలి. ఇది కలిపిన తర్వాత అందులో కొబ్బరి నూనె వేయాలి. దీని తరువాత, మరొక గిన్నెలో నీటిని మరిగించి, అందులో మిశ్రమం ఉన్న కంటైనర్ గిన్నెను ఉంచాలి (డబల్ బాయిలర్ పద్ధతి ద్వారా). మిశ్రమం బాగా కరిగి, ద్రావణంలాగా మారినపుడు. దీనిని మరొక బాక్స్‌లోకి తీసుకొని చల్లబరిచి, 10 నిమిషాలు ఫ్రిజ్‌లో ఉంచండి. మీ లిప్ బామ్ సిద్ధంగా ఉంది.

ఇన్‌స్టంట్ చట్నీ



ఉదయన్నే ప్రతి ఇంట్లో మొదలయ్యే హడావుడి అల్పాహారం అదేనండీ బ్రేక్ ఫాస్ట్ కోసమే, ఆకలిగా లేకపోయినా, తినాలని లేకపోయినా సరే పల్లి చట్నీ చూడగానే, అందులోనూ దోశ, ఇడ్లీ, వడలకి పల్లి చట్నీ ఉంది అంటే చాలు ఆకలి అదే వచ్చేస్తుంది పిల్లలకి, పెద్దలకి. మరి అంత రుచికరమైన పల్లిల చట్నీ, ఆదివారం అంటే అంతా ఇంట్లోనే ఉంటారు కాబట్టి తాపీగా చేసుకోవచ్చు.

కానీ అది రోజు అంటే ఇబ్బందే ఒక రకంగా, అందులోనూ జాబ్ చేసే ఆడవాళ్ళు ఉన్న ఇంట్లో అయితే చాలా ఇబ్బందికారంగా ఉంటుంది. ఇటు టిఫిన్లు చేయడం, అటు లంచ్ బాక్స్ కోసం వంటలు, ఈ క్రమంలో ఇంట్లో అల్పాహారం చేయడం అనేది తగ్గుతూ వస్తుంది.

కొంతమందికి టిఫిన్, చట్నీ రెండు చేయడం ఇబ్బందిగా ఉంటుంది. అదే అప్పటికప్పుడు (ఇన్సంట్)తేలికగా, గ్రైండ్ చేయాల్సిన పనిలేకుండా చట్నీ అయితే ఇంట్లో ఎవరైనా చేయవచ్చు. ఆ ఆలోచనతో వచ్చుండే ఇన్సంట్ పల్లి చట్నీ పాడి. ఒక్కసారి చేసిపెట్టుకుంటే, నెలరోజులవరకు ఉంటుంది.

అందులోనూ మామూలుగా చేసే చట్నీ రుచితో మరియు తాజాగా చేసిన అనుభూతిని ఇస్తుంది. మరి ఎందుకింకా ఆలస్యం మీరు ప్రయత్నించండి..

పల్లీలు : ఒక కప్పు, పుట్నాలు: అరకప్పు, ఎండుమిర్చి : 6-8, జీలకర్ర : అర టీస్పూన్, ఆవాలు : అర టీస్పూన్, వెల్లుల్లి : 10 పాయలు, కరివేపాకు : 2 రెమ్మలు, ఉప్పు : తగినంత

తాలింపుకు కావలసినవి :- ఎండుమిర్చి : 3, జీలకర్ర : పావు టీస్పూన్, ఆవాలు : పావు టీస్పూన్, కరివేపాకు : 1 రెమ్మ, పసుపు : చిటికెడు, నూనె : 2 టేబుల్ స్పూన్లు.

తయారీ: కడాయి లేదా నాన్ స్టిక్ పాన్ స్టవ్ పై పెట్టి వేడైన తరువాత పల్లీలు వేసి చిన్న మంట పైన వేయించుకోవాలి.

పల్లీలు దోరగా అయిన తరువాత పుట్నాలు, వెల్లుల్లిపాయలు, ఎండుమిరపకాయలు, జీలకర్ర, ఆవాలు, కరివేపాకు, వేసి కలుపుతూ కరివేపాకు పచ్చిదనం పోయేంతవరకు వేయించుకోవాలి.

చేతితో ఒత్తినవుడు పొడి పొడిగా అయినప్పుడు, స్టవ్ ఆపేసి చల్లపరచుకోవాలి. పల్లీల మిశ్రమం చల్లబడిన తరువాత మిక్సీలో వేసి, పొడిగా చేసుకోవాలి.

తాలింపు కోసం ఒక పెనంలో నూనె పోసి వేడి అయిన తరువాత ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి, కరివేపాకు బాగా వేగిన తరువాత పసుపు వేసి కలపాలి. స్టవ్ ఆపేసి, ఈ పొపును గ్రైండ్ చేసుకున్న చట్నీ పొడిలో వేసి బాగా కలుపుకోవాలి. ఇందులోనే రుచికి సరిపడా ఉప్పువేసి బాగా కలుపుకుని, గాలి చొరబడని డబ్బాలో పోసి నిలువ చేసుకుంటే నెల రోజుల వరకు తాజాగా ఉంటుంది. మనకు అవసరమైనపుడు, బ్రేక్ ఫాస్ట్ లో ఇడ్లీ, దోశ చేసుకున్నప్పుడు, ఒక గిన్నెలో 4 లేదా 5 స్పూన్ల పొడి తీసుకుని కొద్ది కొద్దిగా నీళ్ళు కలుపుతూ బాగా కలుపుకుంటే చాలా రుచికరమైన ఇన్సంట్ చట్నీ రెడీ.

మల్టిగ్రెయిన్ బిస్కెట్స్

పిల్లలను మీకు ఇష్టమైన చిరుతిండి ఏంటి అని అడిగితే వెంటనే వినిపించే పేరు బిస్కెట్స్. ఎక్కువ శాతం పిల్లలు నో చెప్పకుండా తినే స్నాక్స్ కూడా బిస్కెట్సే. స్కూల్ స్నాక్స్ బాక్స్ ఓపెన్ చేసి చూస్తే 90% అవే కనిపిస్తాయి. ఎందుకంటే పాకెట్ తీసి బాక్స్ లో పెడితే మనకు తెలిక, వాళ్ళు తినను అని మారాం చేయరు.

మరి పిల్లలు ఇంతగా ఇష్టపడే వాటిని ఇంట్లోనే చేసుకోవచ్చు. ఒక పదిహేను నిముషాలు కేటాయించగలిగితే శుభ్రంగా, ఆరోగ్యకరమైన పదార్థాలతో తేలికగా చేసుకోవచ్చు. మల్టీగ్రైన్ గోధుమపిండి ఆరోగ్యానికి మంచిదే, అలాగే బెల్లం లో పిల్లలకి కావాల్సిన ఐరన్ ఉంటుంది. ఈ రోజుల్లో ఎక్కువమందిలో రక్తహీనత ఉంటుంది. కానీ అది మనం గుర్తించలేకపోతున్నాం. కాబట్టి పిల్లలకి ఇంట్లోనే వారికి ఇష్టమైన బిస్కెట్స్ ని చేసిపెడితే వారు ఆరోగ్యంగా ఉంటారు. మనకు అవి ఎలా చేశారో అన్న టెన్షన్ ఉండదు. ఈ మల్టిగ్రెయిన్ బిస్కట్స్ చాలా రుచికరంగా ఉంటాయి. ఇంకెందుకు ఆలస్యం ఎలా చేయాలో చూద్దాం పదండి.

మల్టిగ్రైన్ గోధుమ పిండి : రెండు కప్పులు, తరిగిన బెల్లం - ఒక కప్పు, ఉప్పు : చిటికెడు, నీరు : తగినంత, యాలకుల పొడి : పావుస్పూన్, నూనె : వేయించడానికి సరిపడా.

ఒక గిన్నెలో తరిగిన బెల్లం వేసి కొంచెం నీరు పోసి బెల్లం కరిగేంతవరకు వేడిచేయాలి.

ఒక వెడల్పాటి పాత్రలో పిండి తీసుకుని అందులో ఉప్పువేసి కలపాలి. తరువాత కరిగిన బెల్లం నీటిని పోసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. పదినిముషాల తరువాత చిన్న ఉండలుగా చేసుకుని ఒక్కో ఉండని చపాతీలా చేసుకుని, చాకు తో అడ్డంగా నిలువుగా, డైమండ్ ఆకారంలో కట్ చేసుకోవాలి. ఒక సన్నని తీగలాంటిది తీసుకొని ఆ డైమండ్స్ మధ్యలో చిల్లులు పెట్టుకోవాలి (క్రాకజాక్ బిస్కట్ లా) .

కడాయి లో నూనె పోసి వేడయ్యాక కట్ చేసి పెట్టుకున్న వాటిని వేసి గోధుమ రంగులోకి వచ్చేవరకు వేయించుకుంటే ఆరోగ్యకరమైన బిస్కెట్లు రెడీ.

ఇవి వారం రోజులవరకు నిలువ ఉంటాయి. ఈ బిస్కెట్లని పిల్లల దగ్గర నుండి పెద్దల వరకు అందరు ఇష్టంగా తింటారు.

బీట్‌రూట్ దోశ

కావల్సినవి: బీట్రూట్ : 1 పెద్దది, దోశ పిండి : తగినంత, అల్లం ముక్క : చిన్నది, వెల్లుల్లి - 10 పాయలు, జీలకర్ర : 1 టీస్పూన్, పచ్చిమిర్చి : 4, ఉప్పు : తగినంత, నూనె / నెయ్యి : తగినంత, తరిగిన పుదీనా : కొద్దిగా

ముందుగా బీట్రూట్‌ని కడిగి చిన్న ముక్కలుగా తరిగి మిక్సీ జార్లో వేసి, అందులోనే పచ్చి మిర్చి, జీలకర్ర, అల్లం, వెల్లుల్లిపాయలు, పుదీన, ఉప్పు వేసి పూరీలా గ్రైండ్ చేసుకోవాలి. అవసరమైతే కొన్ని నీళ్ళు కలుపుకోవచ్చు.

ఇప్పుడు దోశపిండిలో గ్రైండ్ చేసుకున్న పూరిని వేసుకుని బాగా కలుపుకోవాలి. పిండి ఎర్రనిరంగులో ఆకర్షణీయంగా మారుతుంది. దోశ పెనం మీద కొంచెం నూనె వేసి సగం కట్ చేసిన ఉల్లిపాయతో రుద్దాలి. ఇలా చేయడం వల్ల దోశలు పెనానికి అంటుకోకుండా చక్కగా వస్తాయి. ఇప్పుడు మంటను హై లో పెట్టి, గరిటెతో దోశపిండి వేసి గుండ్రంగా తిప్పుతూ పెనం అంతా పరుచుకునేట్టు చేయాలి. దోశ చుట్టూ నూనె కానీ నెయ్యి కానీ వేసుకోవాలి. నూనె వేసిన తరువాత మూతపెట్టి, రెండు నిముషాల తరువాత దోశను మడిచి ప్లేట్ లో పెట్టి మీకు నచ్చిన చట్నీతో ఆస్వాదించండి.ఈ బీట్రూట్ దోశలను పుదీనా చట్నీతో కానీ పల్లిల చట్నీతో కానీ వేడి వేడిగా తింటే చాలా రుచికరంగా ఉంటాయి.

చుండ్రు అంటువ్యాధా? తలపై మాత్రమే వస్తుందా?



చుండ్రు.. చాలా మంది వేధించే సమస్య. ఆడ, మగ అని తేడా లేకుండా చాలా మంది చుండ్రుతో ఇబ్బంది పడుతుంటారు. చుండ్రు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే సమస్య కాదు. కానీ, ఈ సమస్యతో ఇబ్బంది పడుతుంటారు. జుట్టు ముట్టుకున్నా భుజాలపై చుండ్రు పడి అవస్థ పడతారు.

చుండ్రు గురించి చాలా మంది తప్పుగా అనుకుంటారు. సరైన శుభ్రత లేకపోవడం, చుండ్రు ఒకరి నుంచి ఒకరికి వస్తుందని, చుండ్రు వల్ల జుట్టు రాలుతుందని చాలా మంది అనుకుంటారు. మరి అవి అపోహలా, నిజాలా అనేది ఇప్పుడు చూద్దాం.

1. పరిశుభ్రత సరిగ్గా లేకపోతే చుండ్రు వస్తుంది. క్రమం తప్పకుండా జుట్టుకు షాంపూ పెట్టుకోవడం వల్ల చుండ్రును అదుపులో ఉంచుకోవచ్చు. క్రమం తప్పకుండా జుట్టు కడుక్కోవడం వల్ల జుట్టుకు మంచి పరిశుభ్రత లభిస్తుంది. అయితే చుండ్రు రావడానికి చాలా కారణాలు ఉంటాయి. చుండ్రు రావడానికి జుట్టుకు వాడే నూనె కూడా ఓ కారణం అవుతుంది.

2. చుండ్రు తలపై మాత్రమే వస్తుంది అనుకోవడానికి వీలులేదు. తలపై చుండ్రు రావడానికి చాలా అవకాశం ఉంటుంది. అయితే తలపై ఒక్క చోట మాత్రమే చుండ్రు వస్తుంది అనుకోవడం పొరపాటే. చాలా మందికి తలపై చుండ్రు విపరీతంగా వస్తుంది. కొంత మంది వ్యక్తుల్లో కనుబొమ్మలు, చెవులు, ముక్కు చుట్టు కూడా చర్మం నుంచి పొలుసుగా రావడం జరుగుతుంది. ఇది కూడా చుండ్రు అని చాలా మందికి తెలియదు.

3. చుండ్రు అంటువ్యాధి: చుండ్రు అనేది ఒకరి నుంచి ఒకరికి వస్తుందని, ఇద్దరు వ్యక్తుల జుట్టు తగిలినప్పుడు చుండ్రు వ్యాపిస్తుందని చాలా మంది అనుకుంటారు. చుండ్రుకు దారితీసే ఫంగల్ బ్యాక్టీరియా ప్రతి ఒక్కరి తలపై ఉంటుంది. అయితే అది వివిధ కారణాల వల్ల ఎక్కువై చుండ్రుగా మారి బయటకు కనిపిస్తుంటుంది.

4. చుండ్రు వల్ల జుట్టు రాలుతుంది: జుట్టు రాలడానికి చుండ్రు దారి తీస్తుందని అనుకుంటారు చాలా మంది. నెత్తిపై చుండ్రు చికాకు తెప్పిస్తుంది. దీని వల్ల గోకడం లాంటివి చేసినప్పుడు జుట్టు కుదుళ్లు బలహీనపడతాయి. అలా జుట్టు ఊడిపోతుంది తప్ప చుండ్రు వల్ల జుట్టు రాలడం జరగదు. జుట్టు రాలడానికి ప్రధాన కారణం ఆందోళన, పోషకాలు అందకపోవడం, అనారోగ్య సమస్యలు, కొన్ని రకాల మందుల వల్ల జుట్టు రాలుతుంది.

5. చుండ్రు, పొడి స్కాల్ప్ రెండూ ఒకటే: చుండ్రు, పొడి స్కాల్ప్ రెండూ చూడటానికి ఒకేలా ఉంటాయి. కానీ చుండ్రు సాధారణంగా లేత పసుపు, తెలుపు రంగులో ఉండే పెద్ద జిడ్డుగల ఫ్లేక్స్ లా ఉంటాయి. చుండ్రు వల్ల దురద, జిడ్డు, పొలుసులు వస్తుంటాయి. పొడి స్కాల్ప్ వల్ల వచ్చే ఫ్లేక్స్ చాలా చిన్నగా ఉంటాయి. పొడి చర్మం ఇతర శరీర భాగాలపైనా కనిపిస్తుంటుంది. దీని వల్ల నెత్తిపై కూడా పొడిగా ఉండని అనుకోవచ్చు. అయితే దీనిని గుర్తించడం కొద్దిగా కష్టం. వైద్యులు మాత్రం పరీక్షించి గుర్తించగలుగుతారు.

ఈ 10 ఆహారాలను పొరపాటున కూడా ఫ్రిజ్‌లో పెట్టొద్దు

వేసవి కాలంలో ఆహారాలు, కూరగాయలు చాలా త్వరగా పాడైపోతాయి. అవి పాడవకుండా ఉండేందుకు చాలా మంది వాటిని ఫ్రిజ్‌లో పెడతారు. అయితే, కొన్ని పదార్థాలు, కూరగాయలను ఫ్రిజ్‌లో పెట్టకూడదని తెలుసా? అవి ఫ్రిజ్‌లో పెట్టి, ఆ తరువాత తినడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఫ్రిజ్‌లో నిల్వ చేయకూడని 10 పదార్థాలేంటో ఇవాళ మనం తెలుసుకుందాం.

చపాతీ, రొట్టెలు, బ్రెడ్ : బ్రెడ్, రొట్టెలు, చపాతీలు ఫ్రిజ్‌లో నిల్వ చేయకూడదు. ఫ్రిజ్‌లో వాటిని నిల్వ చేయడం వల్ల అవి త్వరగా పాడైపోతాయి. గట్టిగా అవుతాయి.

టొమాటో : టొమాటోలను అన్ని రకాల వంటలలో ఉపయోగిస్తారు. అయితే వాటిని ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల రుచి, ఆకృతి రెండూ పాడైపోతాయి.

తేనె: తేనెను ఉపయోగించిన తర్వాత రిఫ్రిజిరేటర్‌లో పెట్టకూడదు. ఎందుకంటే అది ఘనీభవిస్తుంది. దానిలో స్ఫటికాలు ఏర్పడతాయి.

పుచ్చకాయ: పుచ్చకాయ తినేందుకు ఇష్టపడని వారు ఉండరు. అయితే, పుచ్చకాయను ఎప్పుడూ ఫ్రిజ్‌లో పెట్టకూడదు. దీన్ని ఫ్రిజ్‌లో ఉంచడం వలన అందులోని యాంటీఆక్సిడెంట్లు నశిస్తాయి. అంతేకాదు, రంగు, రుచి కూడా మారుతుంది.

బంగాళదుంప: బంగాళదుంపలను పొరపాటున కూడా ఫ్రిజ్‌లో పెట్టకూడదు. బంగాళదుంపలలో స్టార్చ్ ఉంటుంది. వాటిని ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల చక్కెర పరిమాణం పెరుగుతుంది.

ఉల్లిపాయ: ఉల్లిపాయను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల తేమ చాలా త్వరగా గ్రహించి చెడిపోతాయి.

వెల్లుల్లి: వెల్లుల్లిని ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల అది మొలకెత్తుతుంది. దాని రుచి కూడా మారుతుంది. అందుకే వెల్లుల్లిని ఎప్పుడూ ఫ్రిజ్‌లో ఉంచకూడదు.

అరటిపండు: అరటిపండును ఫ్రిజ్‌లో ఎప్పుడూ ఉంచకూడదు. ఎందుకంటే దాని రంగు, ఆకృతి, రుచి త్వరగా చెడిపోతుంది. అరటిపండు బయటి నుండి నల్లగా మారుతుంది.

కాఫీ: కాఫీని కూడా ఫ్రిజ్‌లో ఉంచకూడదు. అది ఫ్రిజ్‌లోని తేమను గ్రహించి గట్టిపడుతుంది. కాఫీ రుచి కూడా క్షీణిస్తుంది.

ఆలివ్ నూనె : ఆలివ్ నూనెను ఫ్రిజ్‌లో పెట్టొద్దు. అది గట్టిపడుతుంది. దానిలో స్ఫటికాలు ఏర్పడతాయి.

చిన్న వయస్సులో దంతాలు బలహీనంగా ఉన్నాయా? ఈ విటమిన్ లోపం కావచ్చు!

ప్రస్తుతం చాలా మంది చిన్న వయసులోనే పంటి నొప్పి సమస్యను ఎదుర్కొంటున్నారు. మీరు 20, 30 సంవత్సరాల మధ్య ఉన్నప్పటికీ, మీరు మీ దంతాలలో నొప్పి లేదా అసౌకర్యాన్ని అనుభవిస్తున్నప్పటికీ, దానిని అస్సలు విస్మరించవద్దని నిపుణులు..

ప్రస్తుతం చాలా మంది చిన్న వయసులోనే పంటి నొప్పి సమస్యను ఎదుర్కొంటున్నారు. మీరు 20, 30 సంవత్సరాల మధ్య ఉన్నప్పటికీ, మీరు మీ దంతాలలో నొప్పి లేదా అసౌకర్యాన్ని అనుభవిస్తున్నప్పటికీ, దానిని అస్సలు విస్మరించవద్దని నిపుణులు సూచిస్తున్నారు. మీ శరీరంలో విటమిన్ డి లోపించిందనడానికి ఇవి సంకేతాలు. దంతాలకు ఎముక మద్దతు ఇస్తుంది. ఎముకలు బలహీనపడినా లేదా చిగుళ్లలో సమస్య లేదా ఇన్ఫెక్షన్ ఏర్పడినా అది దంతాలపై ప్రభావం చూపుతుంది. చిగుళ్ల ఇన్ఫెక్షన్, ఎముకలు బలహీనపడటం అన్నీ మన దంతాల ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. ఇది సాధారణంగా విటమిన్ డి లోపం వల్ల వస్తుంది. కొన్ని సందర్భాల్లో పేద నోటి ఆరోగ్యం కూడా ప్రజల దంతాలను బలహీనపరుస్తుంది.

దంతాల సంరక్షణ ఎలా ? సీనియర్ వైద్యుల అభిప్రాయం ప్రకారం మంచి దంతాలు ఆరోగ్యానికి, మీ నోటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. అందుకోసం క్రమం తప్పకుండా దంతాలను శుభ్రం చేసుకోవడం, క్రమం తప్పకుండా చెకప్‌లు చేసుకోవడం అవసరం. అంతే కాదు మంచి దంతాల కోసం ఎముకలు కూడా దృఢంగా ఉండాలి. దీని కోసం శరీరానికి తగినంత విటమిన్-డి ఉండాలి. మీ దంతాలు బలహీనంగా అనిపిస్తే లేదా అలా కదులుతున్నట్లయితే మీ శరీరంలో విటమిన్- డి ఉందో లేదో ఖచ్చితంగా చెకప్ చేసుకోవాలి. విటమిన్-డి తక్కువగా ఉంటే ఈ లోపం మీ దంతాలు బలహీనపడటానికి కారణమవుతుందని స్పష్టంగా తెలుస్తుంది. పట్టణ ప్రాంతాల్లో నివసించే చాలా మంది వ్యక్తులు విటమిన్-డి లోపాన్ని ఎదుర్కొంటారు. ఇది వారి దంత ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. అటువంటప్పుడు విటమిన్ చెక్‌తో పాటు శరీరానికి తగినంత కాల్షియం అందుతుందా లేదా అనేది పరీక్షించుకోండి.

విద్యార్థులకు విజ్ఞానం

- వాతావరణంలోని ఓజోన్ పొర మనల్ని ఏ కిరణాల నుండి రక్షిస్తుంది? - అతినీలలోహిత కిరణాలు
- పెరాక్సిటిక్ అంటే ఏమిటి? - వాయు కాలుష్య కారకం
- 'గ్రీన్ హౌస్ ఎఫెక్ట్' లేకపోతే భూమిపై సగటు ఉష్ణోగ్రత సుమారు ఎంత ఉంటుంది? - 18 డిగ్రీల సెల్సియస్
- భారతదేశంలో అత్యధిక అడవులు ఉన్న రాష్ట్రం ఏది?- మధ్యప్రదేశ్
- వాతావరణంలో ఎక్కువగా కనిపించే వాయువు ఏది?- నైట్రోజన్
- ఒక ప్రాంతంలో చెట్ల పెరుగుదలకు అవసరమైన కనీస ఉష్ణోగ్రత ఎంత ఉండాలి? - 4 డిగ్రీల సెల్సియస్
- భారతదేశంలో అటవీ పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది? - డెహ్రాడూన్
- అడవుల పెంపకం ఎలా జరుగుతుంది? - ఎక్కువ చెట్లను నాటడం
- భారతదేశంలో అత్యధిక అటవీ విస్తీర్ణం ఏది? - రిజర్వు ఫారెస్ట్
- ఆకుపచ్చ బంగారం అని దేన్ని పిలుస్తారు? - అడవికి భారతదేశంలో అత్యధిక అటవీ సంపదకు యజమాని ఎవరు? - రాష్ట్రం
- వన పండుగ దేనికి సంబంధించినది? - చెట్లు నాటడం మెట్ల వ్యవసాయం ఎక్కడ జరుగుతుంది? - పర్వతాల సానువుల్లో
- పర్యావరణ అధ్యయనాల స్వభావం ఏమిటి? - బహుళ క్రమశిక్షణ
- మన చుట్టూ ఉన్న పరిస్థితుల వాతావరణం ఏంటి? పర్యావరణం
- ప్రపంచ పర్యావరణానికి అత్యంత ముఖ్యమైన అడవి ఏది?- ఉష్ణమండల అడవి
- పర్యావరణం అనేది ఆ బాహ్య పరిస్థితులు మరియు ప్రభావాల మొత్తం, ఇది భూమి యొక్క ఉపరితలంపై జీవుల అభివృద్ధి చక్రాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ ప్రకటన ఎవరు ఇచ్చారు?- నికోలస్
- పర్యావరణం ఒక బాహ్య శక్తి, ఇది మనల్ని ప్రభావితం చేస్తుంది. ఇది ఎవరి ప్రకటన?- పార్క్
- ప్రపంచంలో పర్యావరణ అవగాహనను ఎవరు ప్రారంభించారు?- విలియం హెచెట్
- పర్యావరణం యొక్క జీవ కారకం ఏమిటి?- కూరగాయలు

సర్పంచుల సంతకం లేకుండా నిధులను మళ్లించడం అన్యాయం : చింతకాయల ముత్యాలు

పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లాలో సర్పంచుల సంతకం లేకుండా సర్పంచుల నిధులను దొంగిలించిన 8660 కోట్ల రూపాయలపై పంచాయతీ రాజ్ కమిషనర్ లిఖితపూర్వక సమాధానం విడుదల చేయాలని, దారి మళ్లించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు చింతకాయల ముత్యాలు పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

జూలై ఒకటో తారీఖున ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్య కుమారి 2022 -23 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధులు 2010 కోట్ల రూపాయలకు గాను 988 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని వాటిని త్వరలో సర్పంచుల పి .ఎఫ్ .ఎం. ఎస్ ఖాతాలో జమ చేస్తామని, రెండవ విడత నిధులకు ప్రతిపాదనలు పంపుతామని లిఖిత పూర్వక సమాధానం విడుదల చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

2022 -23 వ ఆర్థిక సంవత్సరం పూర్తయి కూడా నాలుగు నెలలు పూర్తయింది. రెండు సంవత్సరాల క్రితం పంపాల్సినటువంటి ప్రతిపాదనలు ఇప్పుడు పంపడం అంటే రాష్ట్ర అభివృద్ధి పైన, గ్రామాల ప్రజల పట్ల, సర్పంచుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అభిప్రాయం ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. పంచాయతీరాజ్ కమిషనర్ హోదాలో ఉండి లిఖిత పూర్వక ప్రకటన విడుదల చేసే ముందు గతంలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి గ్రామ పంచాయతీలకు విడుదల చేసినటువంటి 8660 కోట్ల రూపాయలు సర్పంచుల సంతకం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం దొంగలించి దారి మళ్లించిన విషయానికి కూడా లిఖితపూర్వక సమాధానం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర సర్పంచుల సంఘం డిమాండ్ చేస్తోంది. సర్పంచుల సంతకం లేకుండా 8660 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం దొంగలించి, దారి మళ్లించిన నిధులను వెంటనే సర్పంచుల పి.ఎఫ్.ఎం. ఎస్ ఖాతా నందు జమ చేయాలన్నారు.

గత ఆర్థిక సంవత్సరం2022- 23కు గాను రావలసినటువంటి 15వ ఆర్థిక సంఘం నిధులు 2010 కోట్లు వెంటనే సర్పంచుల పి.ఎఫ్.ఎం.ఎస్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023- 24 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం 2020 కోట్ల రూపాయల నిధులను వెంటనే సర్పంచుల పి.ఎఫ్.ఎం.ఎస్ ఖాతాలో జమ చేయాలన్నారు.

మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం దొంగలించి దారి మళ్లించిన 8660 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరం రావలసిన నిధులు 2010 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రావలసినటువంటి నిధులు 2020 కోట్ల రూపాయలు, ఇప్పటివరకు ఆర్థిక సంఘం ద్వారా సర్పంచులకు హక్కుగా రావలసిన 12690 కోట్ల రూపాయలు సర్పంచుల ఖాతాలో జమ చేసేంతవరకు రాజీలేని పోరాటాలు చేస్తామని, భవిష్యత్ ఆందోళన కార్యక్రమాల కార్యాచరణకు త్వరలో రాష్ట్ర కార్యవర్గం సమావేశమై భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలను రూపొందిస్తుందని తెలిపారు.

వి.ఆర్ పేటలో ఇంటింటికి కుళాయిలు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రెండు నెలల్లో వి.ఆర్ పేట గ్రామంలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలియజేశారు. అనకాపల్లి మండలం వి.ఆర్ పేట, పెద్ద అక్కిరెడ్డిపాలెం గ్రామాలలో ఎంపీపీ గొర్లి నూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అమర్నాథ్ పాల్గొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్రతి ఇంటికి వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల వద్దకు వెళ్లినప్పుడు జనవరి నుంచి మూడు వేల రూపాయలు పెన్షన్ అందుకుంటావు అంటూ వారి భుజం తట్టారు. స్థానికులు గ్రామంలో కాలువల సమస్య తీవ్రంగా ఉందని చెప్పడంతో సంబంధిత అధికారులను పిలిచి రెండు మూడు నెలల్లో గ్రామంలో పూర్తిస్థాయిలో కాలువ నిర్మాణం జరగాలని, ఈ కాలువలను ప్రధాన కాలువకు అనుసంధానం చేయాలని మంత్రి అమర్నాథ్ ఆదేశించారు. కాగా వి.ఆర్ పేటలో అగ్రిగోల్డ్ బాధితులు మంత్రి అమర్నాథ్‌ని కలిసి గోడు వెళ్లబుచ్చుకున్నారు. తమ గ్రామంలో బాధితులకు మూడు కోట్ల రూపాయలు రావాల్సి ఉందని చెప్పారు. దీనిపై అమర్నాథ్ స్పందిస్తూ ఇది రాష్ట్ర వ్యాప్త సమస్య అని ముఖ్యమంత్రితో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సుమారు నాలుగు గంటల పాటు సాగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వెంట వేలాది మంది మహిళలు నడిచారు. కాగా అనకాపల్లి, కసింకోట, మునగపాక గ్రామాలకు అవసరమైన తాగు నీటిని అందించే 20 కిలో లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్‌ను మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. అలాగే తొమ్మిది లక్షల రూపాయలతో నిర్మించిన కాలువలను మంత్రి ప్రారంభించారు.

అనంతరం అమర్నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంతటి ఆర్థిక భారమైనా భరించి పేద ప్రజలకు బడుగు బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి అంతరాయం లేకుండా పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిది అని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోను తు.చ తప్పకుండా అమలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డి దేశంలోని మిగిలిన ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచారని మంత్రి అమర్నాథ్ చెప్పారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అప్పటికున్న స్థాయిలో కూడా సమస్యలు లేకుండా చేయాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన చెబుతూ అధికారులు కూడా ముఖ్యమంత్రి లక్ష్యాన్ని గుర్తించి, అందుకు అనుకూలంగా పనిచేస్తూ ప్రజలకు మేలు చేయాలని ఆయన సూచించారు.

బొడ్డేడ ప్రసాద్‌కు ఘన స్వాగతం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): వైసిపి పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన తర్వాత తొలిసారిగా అనకాపల్లి వచ్చిన బొడ్డేడ ప్రసాద్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం తిరుపతి నుంచి నేరుగా అనకాపల్లి చేరుకున్న ప్రసాద్‌కు రైల్వే స్టేషన్ దగ్గర నుంచి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికి అతనిని అనకాపల్లి పార్టీ కార్యాలయానికి తీసుకొచ్చారు. ప్రసాద్‌ను నేరుగా మంత్రి అమర్నాథ్ కలిసి ఆయనను పూలమాలతో సత్కరించారు, ఆ తర్వాత పార్టీ కార్యాలయ ఆవరణలో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి అమర్నాథ్, సుకుమార వర్మ, దంతులూరి దిలీప్, చిక్కాల రామారావు, జెడ్పిటిసిలు ఉర్ల అనురాధ, భీశెట్టి సత్యవతి, శ్రీధర్ రాజు, బాబు, గొలవెల్లి శ్రీనివాసరావు, మనసాల శ్రీధర్, ఎంపీపీ లక్ష్మీ గున్నయ్య నాయుడు, ఎంపీపీ గొర్లి నూరిబాబు, కార్పొరేటర్ జాజుల ప్రసన్న రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పలక యశోద రవి, రాష్ట్రగనర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడా శివ, పెదిశెట్టి గోవింద్, ఎంపీటీసీలు జడ్పీటీసీలు, సర్పంచులు, పార్టీలో వివిధ పదవుల్లో ఉన్న నాయకులు, వైసిపి కుటుంబ సభ్యులు బొడ్డేడ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై మంత్రి అమర్నాథ్, బొడ్డేడ ప్రసాద్ పార్టీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి రింగు రోడ్డు మీదుగా చిన్న నాలుగు రోడ్డు జంక్షన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనకాపల్లి పూడిమడక రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. వేలాదిమంది అభిమానులు బైక్ ర్యాలీతో బొడ్డెడను మునగపాకకు తీసుకువెళ్లారు. బొడ్డేడ ప్రసాద్ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించడంతో పార్టీ క్యాడర్లో నూతన ఉత్సాహం నెలకొంది.

ఉద్యమాలకు ప్రేరణిచ్చే నవల

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): 'ది మేంగో లేడీ' ఇంగ్లీష్ నోవల్ పుస్తకం ఉద్యమాలకు స్ఫూరణ ఇచ్చేలా తోడ్పడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. 'ది మేంగో లేడీ' ఇంగ్లీష్ నవల పుస్తకాన్ని సీతంపేట స్థానిక పౌర గ్రంధాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ జరిగింది. ఈ పుస్తకావిష్కరణ సాంపేట పోరాట యోధురాలు జ్యోతి ఆవిష్కరించారు. హిందూ నట్ ఎడిటర్ ఈ పుస్తకం కుమారి మళ్ళాజ్యోస్యుల అనుపమ పద్మజ రాయడం అనందాన్ని వ్యక్తం చేసారు. ఇటువంటి పుస్తకాలు మరెన్నో వ్రాయాలని ఆకాంక్షించారు. ఆంధ్రా యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నళిని ఈ నవలను పరిచయం చేయగా, ద్రవిడ యూనివర్శిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కె.ఎస్.చలం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి. మురళి, సాహితీవేత్త, రచయితలైన అట్టాడ అప్పల నాయుడు, శ్రీనివాసులు ప్రశంగించారు. ఉత్తరాంధ్ర వర్తమాన, సామాజిక జీవితపు వాస్తవ చిత్రీకరణ ఈ నవలలో పొందు పరిచారన్నారు. ఉద్యమాలకు ప్రేరణగా ఈ నవల తొడ్పడుతుందని వక్తలు అభిప్రాయ పడ్డారు. మరిన్ని మంచి నవలలు రచయిత్రి నుండి ఆశిస్తున్నామన్నారు. రచయిత్రి స్పందిస్తూ నేను వ్రాసిన ఈ పుస్తకాన్ని ఆదరించినందుకు, ప్రోత్సహించినందుకు అందరికి కృతజ్ఞతలు తెలియచేసారు.

పేద విద్యార్థులకు శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక గవర పాలెం గౌరీ సంఘం 2019 నుండి 23సంవత్సరాలు సంబంధించిన పది లక్షల రూపాయల ఉపకార వేతనాలను పేద విద్యార్థులకు అందజేసింది. స్థానిక కొణతాల సుబ్రమణ్యం కళ్యాణ మండపంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. మాజీ గౌరీ సేవా సంఘం అధ్యక్షులు మల్ల సాంబశివరావు ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ జరిగింది . గౌరీ సేవా సంఘం అధ్యక్షులు బొడ్డేడ సన్యాసి నాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజి, కోశాధికారి కర్రి శివన్నారాయణ, పెంటకోట ఉమామహేశ్వర రావు. పెంటకోట బాలకృష్ణ, ఆళ్ల లక్ష్మీనరసింగరావు డాక్టర్ విష్ణు మూర్తి, చేతుల మీదగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మాజీ గౌరీ సేవా సంఘం అధ్యక్షులు పెంటకోట సుబ్రమణ్యం మాజీ కార్యదర్శి పెదరాము ఎల్లపు రమణ పాలకవర్గ సభ్యులు ఆహ్వానితులు పాల్గొనడం జరిగింది. ఈరోజు సుమారుగా 200 మందికి ఈ ఉపకార వేతనాలు రూపాయలు 10 లక్షల రూపాయల అందజేశారు. ఈ ఉపకార వేతనాల్లో దాతలు ఇచ్చిన డిపాజిట్లను, వచ్చిన వడ్డీతో అదనంగా శ్రీ గౌరీ సేవా సంఘం ఎక్కువ మొత్తం నిధులను వెచ్చించి మొత్తం సుమారుగా 10 లక్షల రూపాయలు అందించినట్టు పాలకవర్గ సభ్యులు తెలిపారు.

గోదావరిలో వలకు చిక్కిన భారీ పండుగప్ప చేప

గౌతమి గోదావరి నదిలో యానాం దగ్గర భారీ పండుగప్ప చేప ఒకటి మత్స్యకారుల వలకు చిక్కింది. సుమారు 15 కేజీల బరువున్న ఈ పండుగప్ప చేపను స్థానిక మార్కెట్‌లో వేలం వేయగా రూ.9 వేల ధర పలికింది. మత్స్యకార దంపతులు పొనమండ భద్రం, రత్నులు దీనిని వేలంలో దక్కించుకున్నారు. సముద్రంతో పాటు అరుదుగా గోదావరిలోనూ వలకు చిక్కే పండుగప్ప చేప రుచి ఆమోఘమని చెబుతారు.

గోదావరి నదిలో భారీ పండుగప్ప చేపలు దొరకడం అత్యంత అరుదని మత్స్యకారులు తెలిపారు. గతంలో గోదావరిలో 20 కేజీల పండుగప్ప దొరకగా ప్రస్తుతం దొరికిన పండుగప్ప చేప 15 కేజీల బరువు ఉందని మత్స్యకారులు చెప్పారు. ఉప్పు నీటితో పాటు మంచి నీటిలో పెరగడం పండుగప్ప ప్రత్యేకత. ఈ చేప మాంసాహార జీవి అని, మన శరీరానికి కావాల్సిన ప్రొటీన్లలో చాలావరకు ఈ చేపలో ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

ఏపీకి మరో వందే భారత్ ఎక్స్ ప్రెస్
ఈ నెల 7 నుంచి సర్వీసులు ప్రారంభం

ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్. రాష్ట్రానికి మరో వందేభారత్ రైలు వస్తోంది. విజయవాడ-చెన్నై నగరాల మధ్య ఈ నెల 7 నుంచి వందేభారత్ రైలు రాకపోకలు మొదలు కానున్నాయి. దేశ వ్యాప్తంగా ఐదు వందే భారత్ రైళ్లను మోదీ ప్రారంభించనున్నారు. ఇందులో విజయవాడ- చెన్నై మధ్య నడిచే రైలు ఒకటి. ఈ నెల 8 నుంచి రైలు సర్వీసులు పూర్తి స్థాయిలో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ రైలు ఏయే స్టేషన్లలో ఆగుతుంది, రాకపోకల షెడ్యూల్, టికెట్ ధరలు తదితర వివరాలను ఒకటి, రెండు రోజుల్లో ప్రకటించనున్నారు. విజయవాడ - రేణిగుంట మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని రేణిగుంట మీదుగా రైలును నడపాలని విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు కోరినట్టు తెలుస్తోంది.

ఆర్జీఎల్ ఫార్మా పరిశ్రమ ఎదుట నిర్వాసితుల ఆందోళన

పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా పరవాడ మండలం రాంకీ ఫార్మాసిటీ ఎస్ఈజెడ్‌లో ఆర్జిఎల్ ఫార్మా పరిశ్రమ గేటు వద్ద నిర్వాసితులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఆందోళన జరుగుతున్న గేటు వద్దకెళ్లి నిర్వాసితులకు మద్దతు పలికారు. నిర్వాసితులను పరిశ్రమలలో పర్మినెంట్ చేయాలని కార్మిక చట్టాలను, కార్మిక హక్కులను అమలు చేయాలని, రెండు సంవత్సరాలు పూర్తి చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానికులకు 75% ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసినా పరిశ్రమలో అమలు కావడం లేదని అన్నారు భూములు, సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులను రోడ్డు పాలు చేయడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వ ఆర్ కార్డులు ఇచ్చినా ఫలితం లేకుండా పోతోందని అవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిర్వాసిత కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత కార్మికులను యాజమాన్యం చులకనగా చూస్తే సహించమని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వైసిపి నేత ఇల్లపు ప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లపు వాసు, బొడ్డపు చెన్నారావు, బుగిడి రామ గోవిందా, కే. ఈశ్వరరావు, నిర్వాసిత కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం యాజమాన్యంతో జరిగిన చర్చల్లో కార్మికులను విధుల్లోకి తీసుకుంటామని, పర్మినెంట్ చేయడానికి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పరవాడ సిఐ ఈశ్వర్ రావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అమావాస్య నాడు పితృదేవతలకు తర్పణములు ఎందుకు చెయ్యాలి?

తర్పణములు చేస్తే వచ్చే లాభము ఏమిటి, చెయ్యకపోతే వచ్చే నష్టము ఏమిటి ?

ప్రతి అమావాస్య నాడు పితృదేవతలు మధ్యాహ్నము అనగా "కుతప" కాలములో మన ఇంటికి వస్తారు. ఆ సమయములో పితృదేవతలను ఉద్దేశించి మనము తిల తర్పణములు చెయ్యాలి.

తర్పణములు చేయనివారు

పితృదేవతల శాపమునకు గురి అవుతారు.

నిరాశా: పితరోయాన్తి శాపంతస్మై ప్రదత్తవాన్ , అమావాస్య నాడు మనము తర్పణములు చేయరని తెలిసి నిరాశచెందిన పితరులు శపించి వెళ్ళిపోతారు అని "గరుడపురాణము" తెలియజేస్తోంది.

పితృదేవతలు ఆగ్రహించి శపిస్తే, మన కుటుంబాలు అనేక కష్ట, నష్టాలకు గురి అవుతాయి.

కుటుంబములో వ్యక్తులు తీవ్రమైన అనారోగ్యమునకు గురికావడము, వివాహ వయసు దాటిపోతున్నప్పటికి వివాహములు అవ్వకపోవడం.

వివాహములు అయినవారికి ఏదో ఒక కారణం చేత భార్య,భర్తలు విడిపోవడము, ముఖ్యముగా సంతానం కలగక పోవడము, పుట్టిన సంతానము జీవించక పోవడము, కుటుంబములో స్త్రీకి చిన్న వయసులో వైధవ్యము ప్రాప్తించడం, సంతానం వలన తీవ్ర సమస్యలు, కుటుంబములోని పురుషులు దుర్ వ్యసనాలకు బానిసలు కావడము ఇటువంటి అనేక శాపాలకు మనము గురి కావలసి వస్తుంది.

కనుక ప్రతి అమావాస్య నాడు పితృ ఋణము తీర్చ డానికి తర్పణములు చెయ్యాలి.

పితరులకు ప్రతి అమావాస్య నాడు తర్పణములు చేస్తే వారి ఆకలి దప్పికలు తీరుతాయి అప్పుడు పితృదేవతలు తృప్తి చెందుతారు, సంతృప్తి చెందిన పితృదేవతలు ఆశీర్వాదం వంశీకుల ఉన్నతికి కారణము అవుతుంది.

అమావాస్య శ్రాద్ధ, తర్పణములు వలన సంతానము ప్రాప్తిస్తుంది అని "స్కాంద పురాణము" లో చెప్పబడినది. వారి ఆశీర్వచనం వలన కుటుంబములోని వారికి వివాహములు అవుతాయి, వారికి సంతానము కలుగుతుంది. పితరులు సంతృప్తి చెంది ఇచ్చే వరాల తో మన కుటుంబము సుఖ సంతోషాలతో జీవిస్తాము.

కనక ప్రతి అవావాస్య నాడు మనము తప్పక ప్రతి ఒక్కరు పితృదేవతలకు తర్పణములు చేసి తీరాలి.

చేముల గోపాల కృష్ణ మూర్తి
కాకినాడ
91 98 66 00 94 17

కిలో 160 రూపాయలకు చేరిన టమాటా ధర

సామాన్యులు కూరగాయల ధరలు చూసి భయపడి పోతున్నారు. ముఖ్యంగా టమాటా, పచ్చి మిర్చి రేట్లు చూసి వణికిపోతున్నారు. తాజాగా ఓ చోట కిలో టమాటా రూ.160లకు చేరింది. మధ్యప్రదేశ్ లోని రాయ్ సెన్ జిల్లాలో ఆదివారం కిలో టమాటా రేటు రూ.160 పలికింది. ఇతర ప్రాంతాల్లో రూ.110 నుంచి రూ.140లకు చేరింది. దిగుబడి తగ్గడంతో టమాటాల కొరత ఏర్పడిందని రాయ్ సెన్ జిల్లా పాలనాధికారి అరవింద్ దూబే తెలిపారు.

గత గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌లో టమాటా ధర రికార్డు ధర పలికింది. కిలో టమాటా రూ.124లకు పెరిగింది. సాధారణంగా మదనపల్లె మార్కెట్‌కు రోజుకు 1500 టన్నుల టమాటా వస్తుంది. పచ్చి మిర్చి అయితే ఏకంగా రూ.160 చేరింది. తెలుగు రాష్ట్రాల్లోని పలు మార్కెట్లలో పచ్చి మిర్చి ధర రూ.140 నుంచి రూ.160 పలుకుతోంది. జనలు పచ్చి మిర్చి కొనడమే మానేశారు.

కాకరకాయ రూ. 100, పంకాయ రూ. 80, బీరకాయ రూ.80, క్యారెట్ రూ.80, దొండకాయ రూ.80, ఉల్లిగడ్డ రూ.30, బెండకాయ రూ. 80, అలచంద రూ.80, దోసకాయ రూ.60, గోరుచిక్కుడ రూ. 80 గా ఉన్నాయి. ఆటు కోడి, కోడి గుడ్డు ధరలు కూడా బాగానే ఉన్నాయి. కిలో చికెన్ రూ.280 నుంచి రూ.300 పలుకుతోంది. కోడి గుడ్డు ఒకటి రూ.6 నుంచి రూ.7 గా ఉంది. కూరగాయల ధరలే కాదు ఉల్లి ధరలు కూడా పెరిగాయి.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయితీతో రైతులకు టమాటాలు అందిస్తోంది. రాయితీతో రూ.50లకు రైతు బజార్ల ద్వారా టమాటాలను అమ్ముతోంది. కడప, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే అమల్లోకి తీసుకువచ్చారు. కాగా త్వరలోనే ఈ పథకాన్ని అన్ని జిల్లాలకు విస్తరించనుంది.

గురుపూర్ణిమ సందర్భంగా స్వామివారి దర్శనం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఈ రోజు విశాఖపట్నం లలితాపీఠంలో గురుపూర్ణిమ శుభ సందర్భంగా కుర్లాలం పీఠం పీఠాధిపతి శ్రీశ్రీ సిద్ధేశ్వరానంద స్వామీజీ వారిని దర్శనం చేసుకొని వారి ఆశీస్సులు పొందిన మాజీ MLC పి.వి.ఎన్ మాధవ్, SvS ప్రకాష్ రెడ్డి, D. దిలీప్ నాయుడు మరియు N. విజయానంద రెడ్డి.

పరిష్కారానికి చేపట్టిన చర్యల్ని అర్జీదారులకు వివరించండి

విజయనగరం, జూలై 03 : వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులకు ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా సంతృప్తికర పరిష్కారానికి చేపట్టిన చర్యలపై ఆయా శాఖల అధికారులు, సిబ్బంది స్వయంగా అర్జీదారులను కలసి వివరించడం ద్వారా సంతృప్తి పరచవచ్చిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ పేర్కొన్నారు. దీనివల్ల సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించలేనప్పటికీ కొంతకాల వ్యవధిలో ఆ సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకం అర్జీదారులో ఏర్పడి అర్జీల పరిష్కారంపై సంతృప్తి వ్యక్తంచేసే అవకాశం ఉంటుందన్నారు. జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల పరిష్కారం కార్యక్రమంలో భాగంగా గత వారంలో అర్జీదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆడిటోరియంలో అధికారులతో సమీక్షించారు. జగనన్నకు చెబుదాంలో వచ్చే వినతులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయకుండా, తగిన చర్యలు పూర్తికాకుండా మూసివేయవద్దని స్పష్టంచేశారు. గ్రావైటి లీజులను అక్రమంగా కేటాయించారంటూ వచ్చిన ఒక వినతిపై గనులు, రెవిన్యూ, జలవనరులు, సర్వే విభాగం అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

వ్యవసాయం, పశుసంవర్ధక, విద్యుత్, సాంఘిక సంక్షేమ, గృహనిర్మాణం, గనులు, ఏపీఎఫ్‌పి, పంచాయతీరాజ్, పోలీసు, రిజిస్ట్రేషన్లు, డ్వామా, మహిళాశిశు సంక్షేమశాఖలకు సంబంధించి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై ఆయా శాఖల అధికారుల వివరణ అడిగారు.

జగనన్నకు చెబుదాంకు 217 వినతులు

కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజల నుంచి 217 వినతులు అందాయి. ఎప్పటిలాగే రెవిన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై అత్యధికంగా 142 వినతులు అందాయి. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 15, హౌసింగ్ 11, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 25, మునిసిపల్ 09, వైద్య ఆరోగ్యశాఖ 05, జిల్లా ఆసుపత్రులపై 03, డిఆర్‌డిఏకు సంబంధించి 07 వినతులు అందాయి.

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎస్.డి.సి.లు సూర్యనారాయణ, పద్మలత తదితరులు వినతుల స్వీకరణలో పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఏపి మోడల్ స్కూల్ భోగాపురం విద్యార్థులు జి.తరుణ్, కె.తరుణ్‌లను జిల్లా కలెక్టర్ అభినందించారు. వీరు విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని డి.ఇ.ఓ. లింగేశ్వర రెడ్డి వివరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి కూడా పాల్గొన్నారు.

జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులను ముందుగా గుర్తించాలి

జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధులను ముందుగానే గుర్తించి అప్రమత్తం కావడం ద్వారా ఈ వ్యాధి త్వరగా వ్యాప్తి చెందకుండా నిరోధించవచ్చని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో తగిన అవగాహన కల్పించడం ద్వారా ఈ వ్యాధులు సోకకుండా అప్రమత్తం చేయవచ్చన్నారు. ప్రజల్లో ఈ వ్యాధులపై అవగాహన

కల్పించడంలో పంచాయతీరాజ్, పురపాలక, పశుసంవర్ధక శాఖలు ముఖ్య భూమిక నిర్వహించాల్సి ఉందన్నారు. జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధుల నిరోధంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. శునకాలు, పశువుల ద్వారానే వ్యాధులు మనుషులకు సోకే అవకాశం ఉంటుందని, ఆ వ్యాధులు సోకినపుడు ఉండే లక్షణాలు తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు.

పెంపుడు జంతువులకు వ్యాధినిరోధక టీకాలు వేయించడం ద్వారా జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సోకకుండా నిరోధించవచ్చని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎస్.అప్పల నాయుడు వివరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటు మందు అందుబాటులో పూటుంచిరని, ప్రజలు కుక్క కాటుకు గురైన వెంటనే ఆసుపత్రికి వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.భాస్కరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రిటిష్ పాలకుల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి సీతారామరాజు

126 వ జయంతి (04 -07-2023)

భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు. బ్రిటిషు పాలకులను ఎదిరించి సాయుధ పోరాటం చేసిన మన్యం ప్రాంత విప్లవ వీరుడు. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన మహావీరుడు రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకలేకుండా పోరాటం చేసారు.ఆ మహావీరుడు అల్లూరి సీతారామరాజు 126 వ జయంతి సందర్భంగా ఆ మహావీరుడిని ఒకసారి స్మరించుకుందాం.

సీతారామరాజు జన్మదినం 1897 జూలై 4న వారి స్వగ్రామం ఇప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలోని మొగల్లు అయినా విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగిలో ఉంటున్న తాతగారు మందలపాటి శ్రీరామరాజు ఇంట సీతారామరాజు వెంకటరామరాజు, నూర్య నారాయణమ్మ దంపతులకు మెడట సంతానంగా జన్మించాడు. చెల్లెలు సీతమ్మ , తమ్ముడు సత్య నారాయణరాజు ఉన్నారు. 1902లో సీతారామ రాజురాజు తండ్రి రాజమండ్రిలో స్థిరపడి, ఫొటోగ్రాఫరుగా పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకున్నాడు. 1908లో గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రబలిన కలరా వ్యాధికి గురై రాజు తండ్రి మరణించాడు. ఆరవ తరగతి చదువుతున్న వయసులోనే తండ్రిని కోల్పోవడం రాజు జీవితంలో పెనుమార్పులే తీసుకువచ్చింది. స్థిరాదాయం లేక, పేదరికం వలన రాజు కుటుంబం అష్టకష్టాలు పడింది. స్థిరంగా ఒకచోట ఉండలేక వివిధ ప్రదేశాలకు వెళ్ళి నివసించవలసి వచ్చింది. పినతండ్రి రామకృష్ణంరాజు ఆర్థికంగా ఆ కుటుంబాన్ని ఆదుకునేవాడు. తండ్రి పాలనలేమి రాజు చదువుపై కూడా ప్రభావం చూపింది. సీతారామరాజు కుటుంబం 1918 వరకు తునిలోనే ఉంది. ఆ కాలంలోనే చుట్టుపక్కలగల కొండలు, అడవులలో తిరుగుతూ, గిరిజనుల జీవన విధానాన్ని గమనిస్తూ ఉండేవాడు. తన మిత్రుడు పేరిచర్ల సూర్యనారాయణ రాజుతో కలిసి మన్యం ప్రాంతాలలో పర్యటించాడు. బ్రిటిషు అధికారుల దురాగతాలు ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారు. క్రమదోపిడి, అన్నల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ ఉండేవి.



మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేది. పోడు వ్యవసాయం చేసుకుంటూ, అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని అమ్ముకుని జీవించే వారిపై బ్రిటిషువారు ఘోరమైన దురాగతాలు చేసేవారు. రక్షిత అటవీప్రాంతం పేరుతో పోడు కొరకు చెట్లను కొట్టడాన్ని నిషేధించింది ప్రభుత్వం. గిరిజనులకు జీవనాధారం లేకుండా చేసింది. అటవీ ఉత్పత్తుల సేకరణలో కూడా ఆడ్డంకులు సృష్టించింది. ప్రభుత్వం నిర్మిస్తున్న రోడ్ల కాంట్రాక్టర్ల వద్ద గిరిజనులు రోజు కూలీలుగా చెయ్యవలసి వచ్చింది. కాంట్రాక్టర్లు ప్రభుత్వాధికారులకు లంచాలు తినిపించి, ఆ కూలీ కూడా సరిగా ఇచ్చేవారు కాదు. అరు అణాలు కూలీ అనిచెప్పి, అణాలో, రెండో అణాలు ఇచ్చేవారు. నిత్యావసరాలను మళ్ళీ అదే ప్రభుత్వపు తాబేదార్ల వద్ద కొనుక్కోవలసి వచ్చేది.కాంట్రాక్టర్ ఇచ్చే కూలీ వీటికి సరిపోయేదికాదు. కడుపు ఆకలి తట్టుకోలేక చింత అంబలి తాగే వారు. దాని వలన కడుపులో అల్సర్లు వచ్చేవి. దీనికితోడు, గిరిజనుల పట్ల అధికారులు, కాంట్రాక్టర్లు అమానుషంగా ప్రవర్తించే వారు. అడవుల్లో వారు ప్రయాణం చెయ్యాలంటే, గిరిజనులు ఎత్తుకుని తీసుకువెళ్ళాలి. గిరిజన స్త్రీలపై, వారు అత్యాచారాలు చేసేవారు. అయినా ఏమీ చెయ్యలేని స్థితిలో గిరిజనులు ఉండేవారు.మన్యం ప్రజలలో రాజు తెచ్చిన చైతన్యం మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడిని ఎదుర్కోవడానికి గిరిజనులకు ఆండగా నిలిచి బ్రిటిషు ప్రభుత్వం పై పోరాటం చెయ్యాలని రాజు నిర్ణయించుకున్నాడు. గిరిజనులకు తమ హక్కులను వివరించి, వారిలో ధైర్యాన్ని పెంపొందించి, అన్యాయాలను ఎదిరించే విధంగా తయారుచేసాడు. మన్యం లోని గిరిజనులను సమీకరించి, వారికి యుద్ధవిద్యలు, గెరిల్లా యుద్ధపద్ధతులు నేర్పి వారిని పోరాటానికి సిద్ధం చేయ్యసాగాడు. అతని అనుచరుల్లో ముఖ్యులు గాం గంటందొర, గాం మల్లుదొర, కంకిపాటి ఎండు పడాలు.గిరిజనులను దోపిడీ చేసిన బ్రిటిషు అధికారులలో చింతపల్లికి తహసీల్దారు అయిన బాస్టియన్ అత్యంత క్రూరుడు. నర్సిపట్నం మండి లంబసింగి వరకు రోడ్డు మార్గం నిర్మించే కాంట్రాక్టరులో కుమ్మక్కై, కూలీలకు సరైన కూలీ ఇవ్వక, ఎదురు తిరిగిన వారిని కొరడాలతో కొట్టించేవాడు. రామరాజు దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసాడు.అయితే తనపై ఫిర్యాదు చేసాడనే కోపంతో బాస్టియన్ రామరాజు పై ప్రభుత్వానికి ఒక నివేదిక పంపాడు. రామరాజు గిరిజనులను కూడగట్టి విప్లవం తీసుకువచ్చే సన్నాహాల్లో ఉన్నాడనేది దాని సారాంశం. గంటందొర, మల్లుదొర, మొట్టడం వీరయ్యదొర, కంకిపాటి ఎండు పడాలు, సంకోజి ముక్కుడు, వేగిరాజు సత్యనారాయణ రాజు (అగ్గిరాజు), గోకిరి ఎర్రేసు, బొంకుల మొదిగాడు వంటి సాహస వీరులు 150 మంది దాకా ఇతని అనుచరులుగా ఉండేవారు. నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటిషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు. పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్ళడంతో విప్లవం ప్రారంభమైంది. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు పై దాడికి నిశ్చయించుకొన్నారు. ఆగస్టు 22న మన్యం విప్లవం ఆరంభమైంది. 1922 ఆగస్టు 22వ తేదీన చింతపల్లి పోలీస్ స్టేషన్, 23వ తేదీన కృష్ణదేవి పేట, 24న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లను ముట్టడించి ఆయుధాలను వశపరుచు కొన్నారు.చరుసదాడులతో దెబ్బతిని ఉన్న బ్రిటిషు ప్రభుత్వం విప్లవ దళాన్ని అంతం చెయ్యడానికి ఉద్యమాలను అణిచివేయడంలో పేరుందిన స్కాట్ కవర్డ్, హైటర్ అనే అధికారులను నియమించింది. సెప్టెంబర్ 24న తమ అనుచర సైనికులతో వీరు గాలింపు జరుపుతూ దట్టమైన అడవిలో ప్రవేశించారు. రాజు దళం గెరిల్లా యుద్ధరీతిలో వీరిపై దాడిచేసి, అధికారులిద్దరినీ హతమార్చింది. మిగిలిన సైనికులు చెల్లాచెదురై పోయారు. ఆ ఇద్దరు అధికారుల శవాలు తీసుకుని వెళ్ళడానికి స్థానిక ప్రజల మద్యవర్తిత్వం తీసుకోవలసి వచ్చింది బ్రిటిష్ ప్రభుత్వానికి. విప్లవదళం పట్ల ప్రజల్లో సహజంగానే ఉండే ఆదరఅభిమానం ఈ సంఘటనతో మరింత పెరిగిపోయింది. అర్ధతీగలలో రామరాజు పోరాటం అత్యంత సాహసోపేతమైనది అర్ధతీగల పోలీసు స్టేషనుపై అక్టోబర్ 15న జరిపిన దాడి. మొదటి దాడులవలె కాక ముందే సమాచారం ఇచ్చి మరీ చేసిన దాడి ఇది. సీతారామరాజు ని పట్టుకోవడానికి బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నాలు తీవ్రతరం చేసింది.క్రమంగా గూఢచారులు వలన, పట్టుబడ్డ రాజు అనుచరులవలన బ్రిటిష్ అధికారులు రాజు కదలికలను నిశితంగా అనుసరించసాగారు.రాజు ముఖ్య అనుచరుడైన గాము మల్లుదొర పోలీసులకు దొరికిపోయాడు. 17-9-1923న అర్ధరాత్రి దాడిచేసి అతనిని సైనికులు నిర్బంధించారు. విప్లవాన్ని అణచివేసే క్రమంలో పోలీసులు ప్రజలను భయభ్రాంతులను చేసారు.మన్యాన్ని దిగ్బంధనం చేసారు. ప్రజలకు ఆహారపదార్థాలు అందకుండా చేసారు. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు అనే చిలకణ లేకుండా చంపారు.

17-4-1924న మన్యానికి కలెక్టరు (స్పెషల్ కమిషనర్)గా రూథర్ ఫర్డ్ నియమితుడయ్యాడు. ఇతడు విప్లవాలను అణచడంలో నిపుణుడని పేరుగలిగినవాడు రూథర్ ఫర్డ్ కృష్ణదేవిపేటలో సభపెట్టి వారం రోజులలో విప్లవకారుల ఆచూకీ తెలియజేయకపోతే ప్రజలను కాల్చివేస్తామని నిర్దాక్షిణ్యంగా ప్రకటించాడు. అసభకు మంప మునసబు కూడా వెళ్ళారు అతడేమి ఎమి చెప్పాడో తెలుసుకుందామని 1924 మే 6వ తేదిన రాత్రి సీతారామరాజు మంప గ్రామానికి వచ్చిఆ మునసబు ఇంటికి వెళ్ళాడు. తన వల్ల మన్యం ప్రజలు ఎన్ని బాధలు పడుతున్నారో వివరించి, వారికి ఈ బాధలనుండి విముక్తి ప్రసాదించడానికి తాను లొంగిపోవాలని నిశ్చయించుకున్నట్లు చెప్పాడు. తనను ప్రభుత్వానికి పట్టిఇచ్చినవారికి పదివేల రూపాయల బహుమతి లభిస్తుందని, కనుక తనను ప్రభుత్వానికి పట్టిఇమ్మని కోరాడు. కాని తాను అటువంటి నీచమైన పని చేయజాలనని మునసబు తిరస్కరించాడు.తనకోసం మన్య ప్రజలు పడుతున్న వేదన చూసిన రామరాజు ఎంతో బాధపడ్డాడు. బ్రిటిష్ అధికారులు చేతుల్లో మన్య ప్రజలు అనుభవిస్తున్న చిత్రహింసలకు రాజు హృదయం కరిగిపోయింది. చివరకు తనంతట తానుగానే బ్రిటిష్ ప్రభుత్వానికి లొంగిపోవాలని నిశ్చయించుకొని, మంప గ్రామంలో మహా పర్వతం మీద వేదనాభరిత హృదయంతో రాత్రి తెల్లవార్లు గడిపాడు. 1924వ సంవత్సరం మే 7 వ తేదీన తెల్లవారుఝామునే పర్వతాలు దిగివచ్చి మడుగులో స్నానం చేయబోతున్న రామరాజు గురించిన సమాచారాన్ని పోలీస్ అధికారులకు చేరవేశాడు ఒక ద్రోహి. అంతే నిరాయుధుడైన సీతారామరాజును పట్టి బంధించారు. నిరాయుధుడైన సీతారామరాజును రాజేంద్రప్రా లెం తీసుకొని వచ్చి చేతులు విరిచి, చింత చెట్టుకు కట్టి కిరాతకంగా కాల్చివేశారు మేజర్ గుడాల్ ఆ రోజు భారతదేశ చరిత్రలో అత్యంత విషాదకరమైన రోజు. ఆయన 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. జాతి కోసం, నేల కోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ఆ మహావీరుడు తన జీవితాన్ని త్యాగంచేసిన గొప్ప క్షణం అది.భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి. ఇతడు జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు.

సూరీడు ఎలా ఉంటాడో చూడాలనిపిస్తే ఆ విప్లవ మూర్తిని చూపించాలి. తెల్లవారి గుండెల్లో అగ్నిపర్వతంలా పేలిన తెలుగు బిడ్డ.మన్యం ప్రజల గుండె చప్పుడు అల్లూరి సీతారామరాజు. సమరనాదానికి రూపం ఇస్తే, విప్లవ నినాదానికి ఆయువు పోస్తే, మూర్తీభవించిన త్యాగానికి మూర్తిత్వం పస్తే అది కచ్చితంగా అల్లూరి సీతారామరాజు అయి తీరుతుంది. మన్నెం ప్రజల జీవితాలకు ఆత్మత్యాగం అద్ది వారి మనస్సులో దైవం లా నిలిచిన అల్లూరి ఎప్పటికీ స్ఫూర్తి దాయకమే.

పాఠశాలలో టాయిలెట్స్ ప్రారంభం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో లారన్ ల్యాబ్స్ సహకారంతో నూతనంగా నిర్మించిన టాయిలెట్స్ బ్లాక్‌ని విద్యార్థులతో కలసి ఏయూ రెక్టార్ ఆచార్య కె.నమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌లు ప్రారంభించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా వీటిని నిర్మించి అందించిన లారన్ ల్యాబ్స్ డైరెక్టర్ చేవ సత్యనారాయణకు వర్సిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న వేద పాఠశాలకు టీటీడీ సంపూర్ణ సహకారం

తిరుపతి: తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వేద పాఠశాలకు టీటీడీ సంపూర్ణ సహకారం అందిస్తుందని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. తుమ్మలగుంటలోని ప్రభుత్వ ఎస్. చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న శ్రీకల్యాణ వేంకటేశ్వర వేద పాఠశాల మొదటి స్నాతకోత్సవం గురువారం వైభవంగా సాగింది. ఈవేడుకకు టీటీడీ ఈఓ ధర్మా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 8 సంవత్సరాల పాటు శుక్ల యజుర్వేదం విద్యను అభ్యసించిన విద్యార్థులకు యోగ్యతా పత్రాలను అందజేశారు. చెవిరెడ్డి సొంత నిధులతో ఒక్కొక్క విద్యార్థికి రూ.3 లక్షల నగదు, 10 గ్రాములు వెండి డాలరును బహూకరించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ వేదవిద్య పరిరక్షణ బాధ్యత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు తీసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. వేద పాఠశాల నిర్వహణ చాలా కష్టతరమైనదని, అయినా చెవిరెడ్డి దంపతులు వేద పాఠశాల నిర్వహణకు సంకల్పించడం అభినందనీయమని కొనియాడారు. నేటి కాలంలో చెవిరెడ్డి వంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. ఏ పని అయినా ముందుండి కష్టపడి ఇలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగే వ్యక్తులను ఈ 58 ఏళ్ల కాలంలో ఎక్కడా చూడలేదన్నారు. నలుగురు విద్యార్థులతో ప్రారంభమైన వేద పాఠశాలను నేడు 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దేందుకు సంకల్పించడం శుభ పరిణామమన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు, స్వామిపై చెవిరెడ్డికి ఉన్న అపారమైన నమ్మకంతో వేద పాఠశాల విజయవంతంగా అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. టీటీడీ తరపున తుమ్మలగుంట వేద పాఠశాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. శ్రీవారి కటాక్షంతోనే వేద పాఠశాల:

తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వర వేద పాఠశాల నిర్వహణ దైవ సంకల్పమని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఏ గ్రామంలో అయితే భగవంతుడికి మూడు పూటలా నైవేద్యం పెడతారో, ఆ గ్రామంలో ప్రజలకు ఆహార కొరత ఉండదన్న టీటీడీ మాజీ ఈఓ అజయ్ కల్లాం మాట లతోనే శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పునాది పడిందని గుర్తుచేశారు. ఆ తరువాత అనేక నిర్మాణాలు వాకింగ్ ట్రాక్, దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వ్యాయామశాలను వ్యాయామం చేసి ప్రారంభించారని వెల్లడించారు. ఈ క్రమంలోనే వేద పాఠశాల నిర్వహణకు అడుగులు పడ్డాయన్నారు. నేడు దాదాపు 200 మంది విద్యార్థులకు చేరడం దైవ సంకల్పమేనన్నారు. పాఠశాలకు టీటీడీ వేదిక్ యూనివర్సిటీ గుర్తింపు ఇచ్చిందని చెప్పారు.

టీటీడీ వేద పారాయణ పథకం కింద అధ్యాపకుల నియామకానికి సహకారం అందించేందుకు టీటీడీ పాలక మండలి ఆమోదం లభించిందని తెలిపారు. దేశంలోనే కాక, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా 25 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద వేద పాఠశాలను తుమ్మలగుంటలో నిర్మించనున్నట్లు తెలిపారు. వేద పాఠశాల అభునుతికి సంపూర్ణ సహకారం అందించాలని ధర్మారెడ్డిని కోరారు. ఉద్యోగ విరమణ అనంతరం వేద పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. జయేంద్ర సరస్వతి, చిన్నజియర్ స్వామి తుమ్మలగుంట వేదపాఠశాలకు విచ్చేసి వేద విద్య ఆవశ్యకతను తెలియజేశారని గుర్తుచేశారు. తుమ్మలగుంట వేద పాఠశాల వైస్రర్సన్ చెవిరెడ్డి లక్ష్మి, ప్రిన్సిపల్ బ్రహ్మజి శర్మ, వేదిక్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధేశ్యామ్, టీటీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ విభీషణ శర్మ, వేదిక్ యూనివర్సిటీ అధికారులు ముప్పి పవన్, ఫణి యాజుల, కేంద్రీయ సంస్కృత విద్యా పీఠం ప్రొఫెసర్ రాఘవన్, తుడా సెక్రటరీ లక్ష్మి తదితరులు ప్రసంగించారు.

2వ విడతలో 79 మంది విలేకర్లకు

అక్రిడేషన్లు మంజూరు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అక్రిడేషన్ల ప్రక్రియలో 2వ విడతగా జిల్లాలోని 79 మంది విలేకరులకు ప్రెస్ అక్రిడేషన్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో చర్చించి మంజూరు చేశారు. మొదటి విడత మంజూరు చేసిన 160 అక్రిడేషన్లతో కలిపి మొత్తం 239 మంది విలేకరులకు ప్రెస్ అక్రిడేషన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రెస్ అక్రిడేషన్ కమిటీలో సభ్యులుగా ఉన్న విలేకరులకు ఆయన అక్రిడేషన్ కార్డులను అందజేశారు. ఈ సమావేశంలో అక్రిడేషన్ కమిటీ సభ్యులు కే.చంద్రరావు, వి.లోవరాజు, టి.రమేష్, కే.చంద్రశేఖర్, ఎస్.కే.చాంద్ భాషా, గృహ నిర్మాణ శాఖ పిడి కే. రమామణి, జిల్లా రవాణా అధికారి సుజాత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చిన్న మునిస్వామి, డిఐఆర్ఓ కె. ఇంద్రావతి, డి ఏ ఆర్ ఓ డి. సాయి బాబా, ఆర్‌గ్రి అధికారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు సర్వే ఈ నెల 15 లోగా పూర్తి కావాలి

విజయనగరం: మిషన్ గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో క్రింద 1వ తరగతి నుండి 10 వ తరగతి వరకు విద్యార్థుల నమోదు శతశాతం జరగాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. 2005 నుండి 2018 లోపు జన్మించిన వారందరిని వాలంటీర్ యాప్ ద్వారా సర్వే చేయాలని అన్నారు. ఇప్పటి వరకు 43 శాతం పూర్తయిందని, మిగిలిన వారిని 15వ తేదీ లోగా సర్వే పూర్తి గావించాలని సూచించారు. 6వ తరగతి నుండి 7 వ తరగతికి, 10 వ తరగతి నుండి 11వ తరగతి కి చేరే విద్యార్థులను తప్పని సరిగా సర్వే చేయాలన్నారు. ఎం.ఈ.ఓలు, ప్రధానోపాధ్యాయులు వీరిని తదుపరి తరగతులలో శతశాతం నమోదు అయ్యేలా చూడాలన్నారు. అదే విధంగా బడిలో పై వచ్చి కొత్తగా చేరిన వారి వివరాలను హెచ్.ఎం లు ఎం.పి.డి.ఓ లకు, ఎం.ఈ.ఓ లకు అందజేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఎక్కడ చదువుతున్నదీ నమోదు కావాలన్నారు.

ఎం.పి.డి.ఓ లు, తహసీల్దార్లు , ఎం.ఈ.ఓ లు, మండల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జగనన్న సురక్ష, మిషన్ గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో, గడప గడపకు, జగనన్నకు చెప్పుదాం వినతుల అసంతృప్తి, సంక్రమిత వ్యాధులు, ప్రయారిటీ భవన నిర్మాణాల పై మండల వారీగా సమీక్షించారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులన్నీ అప్లోడ్ కావాలన్నారు. ప్రారంభం కాని పనులు వెంటనే ప్రారంభం కావాలని, ప్రోగ్రెస్‌లో ఉన్నవి పూర్తి అయ్యే దశకు చేరాలని అన్నారు. పూర్తయిన పనులకు బిల్లులను అప్లోడ్ చేయాలని, వారంలోగా సిఏఓకు పంపించాలని తెలిపారు.

ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న ప్రయారిటీ భవనాల నిర్మాణాలు స్టేజ్‌లు వేగంగా మారాలని ఆదేశించారు. 15 రోజుల క్రితం నుండి నేటి వరకు జరిగిన ప్రోగ్రెస్‌పై ఆరా తీశారు. పురోగతి కనపడని వారికి ఛార్జ్ మెమోలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తి చేసిన భవనాలను వెంటనే హాండ్ ఓవర్ చేయాలని అన్నారు.

వర్షాకాలం మొదలైనందున సంక్రమిత వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని సూచించారు. ప్రజల్లో డ్రై డే పై అవగాహన కలిగించాలన్నారు. నెర్లీ నిల్వలు లేకుండా చూడాలని, డెంగీ, మలేరియా వ్యాధుల పై ముందస్తు జాగ్రత్తలు ఉండాలన్నారు. ఫీవర్ సర్వే ఖచితంగా జరగాలన్నారు. ఏ హెచ్ సి ల్లో అత్యవసర మందులన్నీ అందుబాటులో ఉంచాలన్నారు.

జగనన్నకు చెప్పుదాం వినతుల సంతృప్తి శాతం పెరగాలన్నారు. వినతుల పై తీసుకుంటున్న చర్యలను అర్జీ దారులకు వివరించాలన్నారు.

ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డి.ఆర్.ఓ గణపతి రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధించేందుకు బీసీలంతా ఒకే తాటి పైకి రావాలి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఆంధ్రప్రదేశ్లో బీసీలందరూ ఐక్యంగా ఉండి బీసీలను చట్టసభలకు పంపేందుకు కృషి చేయాలని ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎల్లూరి పైడా రావు అన్నారు. ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ విభాగం సమావేశం ఇక్కడ కళ్యాణ మండపంలో ఆల్విన్ రాజు ఏబిబిసి, ఎ ఐ బి సి ఎ వ్యవస్థాపక కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పైడారావు మాట్లాడుతూ సుమారు 76 ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వారున్నారని, ఐక్యంగా పనిచేసి రాజ్యాధికారానికి కృషి చేయాలని కోరారు. ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ విభాగానికి జనరల్ సెక్రెటరీగా నియమింపబడిన పి. మధుసూదన రావుకి సభలో అందరూ అభినందన తెలియజేశారు.

ఈ సమావేశంలో బీసీ నాయకులు, స్థానిక బీసీ కార్పొరేటర్లు, విజయనగరం జిల్లా అధ్యక్షులు దామోదర్, వేగి బాబూరావు, మొల్లిరమణ బాబు, అధిక సంఖ్యలో బిసి సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పేరిట బాక్సింగ్ పోటీలు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి పేరిట బాక్సింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అని వైసీపీ విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు.

మద్దిలపాలెంలో గల వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో పదవ వై.ఎస్.ఆర్ కప్ - 2023 జిల్లా స్థాయి సీనియర్స్ మేన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ పోటీల పోస్టరును ఆయన ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ, గత పదేళ్లుగా పోటీలు నిర్వహించడం హర్షణీయం అన్నారు.

వైఎస్ఆర్ పై అభిమానంతో మారుతి ప్రసాద్ ఈ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఈ పోటీలకు టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధి హీరో సుమన్ తదితర ప్రముఖులు, రోజుకు ఒక అతిథిగా పాల్గొంటారు అన్నారు.

వైఎస్ఆర్ జయంతి సందర్భంగా బాక్సింగ్ పోటీలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది అన్నారు.

మారుతి బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్ మాట్లాడుతూ, మధుర వాడలో పదేళ్లుగా తమ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి అన్నారు. కాగా, 2007 నుంచి పోటీలు ప్రారంభించాము అని గుర్తు చేశారు.

జూలై 7 నుండి 9వ తేదీ వరకు చంద్రంపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ వేదికగా మూడు రోజులపాటు పోటీలు జరుగుతాయన్నారు.

7వ తేదీ స్థానిక ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ పోటీలను ప్రారంభిస్తారని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టైక్వాండో కోచ్ ఆనంద్, విశాఖ బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు డీ.రామకృష్ణా రెడ్డి, మారుతి బాక్సింగ్ క్లబ్, సభ్యులు వైసిపి నాయకులు పసుపులేటి గోపి, బంగారు ప్రకాష్, అప్పన్న, వైసీపీ నాయకులు కొల్లి సింహా చలం, రవిరెడ్డి, ఉమా మహేశ్వర రావు, పీలా వెంకట లక్ష్మి, యువశ్రీ, కృపా జ్యోతి, చొక్కర శేఖర్, బంధికాన రాధ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అన్న సురక్ష కార్యక్రమం మార్గదర్శకత్వంపై వాలంటీర్లు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించిన 26వ వార్డు ఇంచార్జి పీలా వెంకటలక్ష్మి. ఈ కార్యక్రమంలో వార్డు ముఖ్య నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు **విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్)**

కాలుష్య నియంత్రణకు సహకరించండి

జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖను కాలుష్య నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన విధి నిర్వహణలో భాగంగా కాలుష్య నియంత్రణకు తమ క్యాంపు కార్యాలయం నుండి జివిఎంసి ప్రధాన కార్యాలయానికి సైకిల్ పై చేరుకున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని నగర పౌరులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వివిధ వ్యాపార సంస్థలు, విద్యాసంస్థల యాజమాన్యం తదితరులు కాలుష్య నియంత్రణకు సహకరించి వారంలో ఒక్క రోజు ప్రజారవాణాను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణకు ప్రతి సోమవారం తనతో పాటు జివిఎంసి ఉద్యోగులు తమ వాహనాలను వదిలి ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని తెలిపారు.

విశాఖ ఉక్కుకు త్వరలో రాహుల్ గాంధీ

గాజువాక, (విశాఖ సమాచారమ్): గాజువాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాజువాకలో ముఖ్య నాయకులు సమవేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గాజువాక కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ నాయకులు రాహుల్ గాంధీ, విశాఖ ఉక్కుకును సందర్భించనున్నట్లు తెలియపరిచారు. ఈ విషయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రథసారథి గిడుగు రుద్రరాజు గన్నవరం విమానాశ్రయంలో రాహుల్ గాంధీని కలసి ఘనంగా స్వాగతం పలికారు .ఈ సందర్భంగా రాహుల్ గాంధీని విశాఖ ఉక్కును సందర్భించాలని, ఆయన రాక కోసం ఉక్కుకార్మిక కుటుంబాలు, మరియు ఉక్కు నిర్వాసితుల కుటుంబాలు ఎదురు చూస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకుని వెళ్ళగా రాహుల్ గాంధీ స్పందిస్తూ విశాఖ ఉక్కును సందర్శించనున్నట్లు తెలియ జేశారు. త్వరలో పర్యటన వివరాలు తెలియ పరచనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు యరబాల భూలోక, చక్రధర్ రావు, యమ్. వర్మ, కొత్తపల్లి పెంటయ్య, సనివాడ హరిబాబు, పి. నరసింగరావు, టి.నరసింగరావు, అప్పా రావు, ఆనంద్, సరీఫ్. గాజువాక నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్య కర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వాసి మృతదేహం ఏపీలో లభ్యం

కర్నూలుజిల్లా: తెలంగాణకు చెందిన ఒక వ్యక్తి మృతదేహం ఏపీలోని కర్నూలు జిల్లాలో లభ్యమైంది. మృతుడిని వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన భారతయ్య (55)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం భారతయ్యను అదే పట్టణానికి చెందిన రవీంద్రగౌడ్, మహమ్మద్ షఫీ గత నెల 26న అతని కారులోనే గొంతుకు టవల్ బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని కారులో కర్నూలు జిల్లా ఉల్లిందకొండ సమీపంలో కొల్లంపల్లి తండా వద్దకు తీసుకెళ్లి పెట్రోల్ పోసి తగులబెట్టారు. భారతయ్య మిస్ అయినట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకుని వారు చెప్పిన మేరకు మృతదేహాన్ని గుర్తించారు. సగానికిపైగా బూడిదైన స్థితిలో భారతయ్య మృతదేహం దొరికింది.

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345
8247526179

ప్రభుత్వ వ్యవస్థలను గడప వద్దకు తెచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిది

కశింకోట, (విశాఖ సమాచారమ్): ప్రభుత్వ వ్యవస్థలను గడప వద్దకు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాలు కశింకోట మండలంలోని జెడ్.తుని, జి.భీమవరం గ్రామాలలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 15 వేల సచివాలయాల పరిధిలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, ప్రతి ఇంటికి వెళ్లి, వాళ్ళ సమస్యలు అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కార మార్గం చూపుతున్నారని చెప్పారు. ప్రజలకు అవసరమైన వివిధ రకాల ధ్రువపత్రాలను, రేషన్ కార్డులను, మ్యూటేషన్లను పైసా ఖర్చు లేకుండా వారికి అందజేస్తున్నారని మంత్రి అమర్నాథ్ చెప్పారు. జెడ్.తుని గ్రామంలో 1060 ఇళ్లు ఉండగా, 1000 ఇళ్లను సచివాలయ సిబ్బంది సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారని, ఇందులో 450 మంది ప్రభుత్వ పరంగా రావాల్సిన ధ్రువ పత్రాలు, ధృవీకరణ కావాలని కోరడంతో 24 గంటల్లో వాటిని అందించేందుకు సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని మంత్రి అమర్నాథ్ చెప్పారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపించేది జగనన్న సురక్ష కార్యక్రమమని ఆయన చెప్పారు.

జి భీమవరం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష సమావేశంలో మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అట్టడుగు స్థాయిలో కూడా ప్రజా సమస్యలు పరిష్కరం అవ్వాలన్న లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని చెప్పారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ప్రజల కోసం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టలేదని, ప్రజా హితం కోరి పాలన చేస్తున్నజగన్మోహన్ రెడ్డిని తిరిగి అధికారంలో తీసుకొచ్చేందుకు మనమంతా కృషి చేయాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తే ప్రభుత్వమే ప్రజలకు తోడుగా ఉంటుందని అమర్నాథ్ చెప్పారు. ఇదిలా ఉండగా జి.భీమవరం, సుందరయ్యపేట, చిన్నయ్యపేట గ్రామాలలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి 60 లక్షల రూపాయలతో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులను

నిర్మించనున్నట్లు మంత్రి అమర్నాథ్ చెప్పారు. అలాగే జి భీమవరంలో గడిచిన మూడు రోజులు నుంచి కొన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయాన్ని తెలుసుకున్న మంత్రి అమర్నాథ్ 24 గంటల్లో ఆ సమస్యను పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ఈ రెండు సభలకు అధ్యక్షత వహించిన కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో పనులు జరగాలంటే ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ సేవలను ఇంటివద్దకే అందిస్తున్నారని చెప్పారు. ఇంతకన్నా మంచి కార్యక్రమాలను, పథకాలను భవిష్యత్తులో మరే ఇతర ప్రభుత్వం అందించలేదని ఆయన చెప్పారు.

కశింకోట జడ్పిటిసి శ్రీధర్ రాజు మాట్లాడుతూ కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా పథకాల అందజేస్తున్న చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ప్రభుత్వంలోని 11 సేవలను ప్రజలు ఇళ్ల వద్దకే నేరుగా తీసుకొచ్చారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు అంతా జగన్మోహన్ రెడ్డికి అండదండగా నిలవాలని ఆయన కోరారు.

Name tattoo, couple tattooz,baby finger print & foot print tattooz, face tattooz, geometric tattooz and all kind of customising tattoos available in D Tattooz in vizag.
Starting price 1000/-
inch price 500/- to starting.
Cell : 97014 52040

ప్రధాని మోదీ నివాసంపై డ్రోన్ కలకలం

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం వద్ద ఓ డ్రోన్ కలకలం రేపింది. సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఓ అనుమానాస్పద డ్రోన్ ప్రధాని నివాసంపై సంచరించినట్లు ఎస్పీజీ నుంచి సమాచారం అందిందని దిల్లీ పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు చేస్తున్నారు.

దిల్లీలోని లోక్ కల్యాణ్ మార్గ్‌లో ప్రధాని అధికారిక నివాసం ఉంది. సాధారణంగా ప్రధాని నివాసం వద్ద నో-ఫ్లై జోన్ అమల్లో ఉంటుంది. అలాంటి ప్రాంతంలోకి డ్రోన్ రావడంతో భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. దీంతో దిల్లీ పోలీసులు, భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి డ్రోన్‌ను ట్రాక్ చేసేందుకు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అయితే ఇప్పటివరకు అనుమానాస్పదంగా ఏదీ కన్పించలేదని తెలుస్తోంది. "ప్రధాని నివాసం, పరిసర ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చేపట్టారు. ఇప్పటివరకు ఎలాంటి డ్రోన్ తరహా వస్తువు కన్పించలేదు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూను కూడా సంప్రదించాం. ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఎగిరే వస్తువును గుర్తించలేదని వారు చెప్పారు" అని దిల్లీ పోలీసులు ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఈ ఏడాది ఏప్రిల్‌లో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం వద్ద కూడా ఓ అనుమానాస్పద డ్రోన్ సంచరించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. కేజ్రీవాల్ నివాసం కూడా నో-ఫ్లై జోన్‌లోనే ఉంది.

జర్నలిస్టుల కుటుంబాలకు అండగా ఉందాం

రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించిన గంట్ల శ్రీనుబాబు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): సమాజాభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న జర్నలిస్టుల కుటుంబాలకు అందరూ అండగా ఉండాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శ్రీనుబాబు తన సొంత నిధులతో పలువురు జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ సుదీర్ఘకాలం సేవలందించిన వీడియో జర్నలిస్టు శివప్రసాద్ కుటుంబానికి రూ.10వేలు అందజేశామన్నారు. ప్రస్తుత శివప్రసాద్ గోవా సమీపంలో వైద్యం పొందుతున్నాడన్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించి తన పరిధి మేరకు సాయం అందించామన్నారు. భవిష్యత్తులో కూడా శివప్రసాద్ కుటుంబాన్ని ఆదుకుంటానని చెప్పారు. మరో సీనియర్ సినీ జర్నలిస్టు బాబూదేవ్‌కు రూ.5000,

జగదాంబ ప్రాంతానికి చెందిన మరో సీనియర్ జర్నలిస్టుకు రూ.5000 ఆర్థిక సహాయం శ్రీను బాబు అందజేశారు. చేపగుంట ప్రాంతానికి చెందిన మరో జర్నలిస్టు రాజశేఖర్‌కు త్వరలో చేయూత అందిస్తామన్నారు. తనకు పదవులతో సంబంధం లేదని, తన పరిధి మేరకు సాయం అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు శ్రీను బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్ భార్య వి.అన్నపూర్ణ, జర్నలిస్టు బాబుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లాసిఫైడ్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8186030813,
7981904385

గిరి ప్రదక్షిణంలో ఉచిత వైద్యసేవ

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి గిరి ప్రదక్షిణం సందర్భంగా నగరంలోని జివిఎంసి సమీపంలోని ప్రభ్యాత వైద్య సంస్థ ఆరిఫి నర్సింగ్ హోం వైద్య నిపుణులు డాక్టర్ అస్లాం నేతృత్వంలోని బృందం ఉచిత వైద్య సేవలను అందించింది. ఫజ ఫౌండేషన్, మెహదీబాగ్ ఫిలాంత్రఫీ సొసైటీ నేతృత్వంలో సుమారు 26 వేల మందికి పైగా భక్తులు ఈ సేవలు వినియోగించుకున్నారు. గిరిజన ప్రదక్షిణంలో పాల్గొన్న భక్తులకు సెయింట్ మెడికేషన్, ఎలక్ట్రోలైట్, బాలిస్టిక్ డ్రస్సింగ్, మస్సాన్ థెరపీ, స్పింటింగ్, బాండేజ్ వంటి సేవలను అందించారు. 11 మంది వైద్యుల బృందం, 14 మంది సహాయకులతో నిర్వర్తించిన ఈ వైద్య సేవ ఆదివారం రాత్రి 7 గంటల నుండి తెల్లవార్లు జరిపారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు, నడివయస్సు వారు, పిల్లలు పైతం కాళ్లకు కలిగిన నొప్పులు, కాళ్ల వాపులు, కాళ్ల పాదులకు ఏర్పడిన పుండ్లు, తదితర ఇబ్బందులకు వైద్య నిపుణులు డాక్టర్ అళ్లాం పర్యవేక్షణలో నిర్వర్తించారు. నవీన్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉత్తర నియోజకవర్గం 42వార్డులో "జగనన్న సురక్ష" క్యాంపు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా "జగన్న సురక్ష" క్యాంపు కార్యక్రమం నెలరోజులు పాటు జరుగుతున్నాయి.ఈ కార్యక్రమంలో భాగంగా ఈ రోజున విశాఖ ఉత్తర నియోజకవర్గం 42వార్డు లైల్వే న్యూ కాలని జివిఎంసీ హై స్కూల్‌లో "జగనన్న సురక్ష" క్యాంపు జరిగింది.ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నేడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొని లబ్ధిదారులకు సంబంధిత సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ "జగనన్న సురక్ష" ప్రజలందరీ కోసం చేపట్టిన

ఒక బృహత్తర కార్యక్రమం, రాష్ట్రవ్యాప్తంగా 15,004గ్రామ మరియు వార్డ సచివాలయాల పరిధిలో 1.6 కోట్ల కుటుంబాలను.ఈకార్యక్రమం కవర్ చేస్తుందని,పరిపాలనను ప్రజల ఇంటి వద్దకే తీసుకువెళ్తుందని రాష్ట్రంలోని 5.3 కోట్ల మంది ప్రజలకు చేరువయ్యేందుకు జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించడం జరిగిందని ఇందులో భాగంగా ప్రతి ఒక్క లబ్ధిదారులకు కావలసిన సర్టిఫికెట్స్ జగనన్న సురక్ష క్యాంపులో ఇవ్వడం జరిగిందని అన్నారు.దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే

శ్రీ వాసుపల్లి గణేష్ కుమార్ గారు మాట్లడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వర్యులు లిగౌరవ వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల మనస్సులో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని "జగనన్న సురక్ష" ద్వారా మరింత చేరువవుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో 42వార్డు కార్పొరేటర్ ఆళ్ళలీలావతి, శ్రీనివాసరావు జోనల్ కమిషనర్ ఆర్ జి వి కృష్ణ, టీసీ కార్పొరేషన్ చైర్మన్ అండవరపు సూరి బాబు %బ్రూణు% పద్మావతి %జీజు% మండల కన్వీనర్ బులుసు జగదీష్, డైరెక్టర్స్ ప్రసాద్, మధు, మరియు 42వ వార్డు సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారాదులు, మహిళలు ప్రభుత్వ అధికారులు,సచివాలయం సిబ్బంది, వాలంటీర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సెంటర్ డైరెక్టర్‌గా సీతామాణిక్యం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రవిశ్వవిద్యాలయం గాంధీ సెంటర్ డైరెక్టర్‌గా డాక్టర్ కె.సీతామాణిక్యం నియమితులయ్యారు. సోమవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద్ రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్ నుంచి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. గాంధీ ఆలోచనలు మరింత విస్తృతంగా ప్రచారం చేస్తూ, విద్యార్థులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలను నిర్వహించాలని వీసీ ప్రసాద రెడ్డి సూచించారు. కార్యక్రమంలో గాంధీ అధ్యయన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా భద్రకాళి అమ్మవారి దర్శనం : పోటెత్తిన భక్తజనం!

అమ్మల గన్న అమ్మ ముగ్ధురమ్మల మూలపుటమ్మ సాక్షాత్తు శక్తి స్వరూపిణి అయిన భద్రకాళి అమ్మవారి ఆషాఢ మాస శాకంబరీ ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఏ అమ్మవారి ఆలయంలోనూ లేనివిధంగా భద్రకాళి అమ్మవారికి ప్రతి సంవత్సరం నాలుగు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ నాలుగు ఉత్సవాలలో ఆషాఢ శుద్ధ పౌర్ణమి నాడు నిర్వహించే శాకంబరీ ఉత్సవం అత్యంత విశిష్టమైనది.

ఆషాఢ శుద్ధపౌర్ణమి అయిన గురుపౌర్ణమి పర్వదినాన అమ్మవారి శాకంబరీ ఉత్సవం ఏటా కన్నుల పండుగగా జరుగుతుంది. రక రకాల కూరగాయలు, ఆకుకూరలు, వివిధ పండ్లతో అమ్మవారిని అలంకరించి, శాకములు ధరించిన తల్లిగా భద్రకాళి అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి నుండి పౌర్ణమి వరకు జరిగే శాకంబరీ ఉత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది.

పదిహేను రోజులపాటు ఉదయం, సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తులను వివిధ రూపాలలో అలంకరించి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటారు. ఇక ఈ క్రమంలోనే ఓరుగల్లులో ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకులు కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో అలంకరించారు. శాకంబరీ ఉత్సవాలలో భాగంగా చేసిన కూరగాయల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భద్రకాళి అమ్మవారి శాకంబరీ అలంకారం కోసం సుమారు ఐదు టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను వినియోగించారు. హైదరాబాద్ మొహిందాజాహి మార్కెట్, గుడిమల్కాపూర్ నుంచి పండ్లు, సికింద్రాబాద్ మోండా మార్కెట్ నుంచి కూరగాయలు తెప్పించారన్నారు.

వరంగల్‌లోని లక్ష్మీపురం, బాలసముద్రం మార్కెట్ నుంచి కూరగాయలు సేకరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెనాలికి చెందిన చావలి హనుమా కుమార్ బృందం, ఆలయ అర్చకులు కలిసి అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేశారు. 1968 నుండి 7 సంవత్సరాల పాటు ప్రజలు కరువు కాటకాలతో, అనావృష్టితో బాధపడుతున్న సమయంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని శాకంబరి వేడుకలు మొదలు పెట్టారు.

కరువుకాటకాల నుంచి ప్రజలు బయటపడాలని, వర్షాలతో జీవించాలని భద్రకాళి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త బి.ఎస్ గణేష్ కాణ్ణి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున శాకంబరీ ఉత్సవం నిర్వహించారు. ఆ తరువాత వర్షాలు కురిసి అందరూ సుఖ సంతోషాలతో జీవించారు. ఇక అప్పటి నుంచి ప్రతి సంవత్సరం భద్రకాళీ అమ్మవారికి శాకంబరీ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

పాడు భూములకు నష్టపరిహారం చెల్లించాలని ధర్నా

నక్కపల్లి, (విశాఖ సమాచారమ్): నక్కపల్లి మండలం లో రాజయ్యపేట నుంచి దోనివాని లక్ష్మీ పురం వరకూ వైజాగ్ చెన్నై ఇండస్ట్రీల్ పేరుతో సేకరిస్తున్న సాగు భూములకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఈరోజు నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామ సాగుదార్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రవి పటానశెట్టికి వినత పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, నాయకులు ఎం.మహేష్ బాబు, వి. అప్పలరాజు, కె.కాశీరావు, వి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి దాడి జన్మదిన వేడుకలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు జన్మదినం సందర్భంగా, 80 వార్డ్ కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో గవరపాలెంలోని వారి స్వగృహం వద్ద జన్మదిన కేక్ కట్ చేసి పేదలకు చీరలు, లుంగీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు ఇంచార్జ్ భాస్కర్ మాట్లాడుతూ అనకాపల్లి నియోజకవర్గాన్ని దాడి వీరభద్రరావు ఏంతో అభివృద్ధి చేశారని, కార్యకర్తలకు అండగా ఉంటూ కష్టాల్లో ఉన్న వారి సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటారని అన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం, రావు గోపాల్ రావు కళాక్షేత్రం, ప్రతి వీధిలో మినీ వాటర్ ట్యాంకులు దాడి వీరభద్రరావు హయంలో నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో. సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, కర్రి శివ నారాయణ, పెట్ల నాగేశ్వరరావు, డివి నర్సింగరావు, బొడ్డేద శంకరరావు, కర్రి మెదినాయుడు, కెప్టెన్ అప్పారావు, చదరం పరమేశ్వరరావు, విల్లూరి నారాయణరావు, కాంబ్లీగుల చందు, అప్పల నాయుడు, సిహెచ్ అప్పలనాయుడు, బి గణేష్, వై నాగరాజు, కే.అప్పలనాయుడు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8186030813.